



# విజయభాను






విశాఖపట్నం, గురువారం 16-05-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 213 పేజీలు : 8 వెల : 1 రూపాయి


# 27న రీవెరిఫికేషన్ ఫలితాలు

### జవాబు ప్రతాలను ఆన్‌లైన్‌లో పెట్టాలి .. హైకోర్టు ఆదేశం



హైదరాబాద్: తెలంగాణలో పెను రాజకీయ దుమారం సృష్టించిన ఇంటర్ ఫలితాల వ్యవహారంపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఫెయిలైన విద్యార్థుల రీవెరిఫికేషన్ ఫలితాలను, జవాబు పత్రాలతో పాటుగా విడుదల చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఫలితాలతో పాటు జవాబు పత్రాలను సైతం ఆన్‌లైన్‌లో పెట్టాలని బోర్డుకు స్పష్టంచేసింది. ఇంటర్ ఫలితాలపై బాలల హక్కుల సంఘం దాఖలు చేసిన వ్యాజ్యంపై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్ నేతృత్వంలోని వేసవి సెలవుల ప్రత్యేక ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. రీవెరిఫికేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు.

ఫలితాల ప్రాసెసింగ్ బాధ్యత గ్లోబరీనాతో పాటు మరో సంస్థకు అప్పగించామని తెలిపింది. ఫలితాలు వెల్లడించి, సవరించిన మార్కుల మెమోలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా ఈ నెల 27న జవాబు పత్రాలు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్ కుమార్ ధర్మాసనానికి తెలిపారు.

అయితే ఫలితాలు, జవాబు పత్రాలు ఒకే రోజున వెల్లడించాలని హైకోర్టు అభిప్రాయపడింది. ఫలితాలు వెల్లడించిన తర్వాత సమాధానాలన్నింటికీ మార్కులు వేశారో, లేదోనన్న తరువాయి 2లో..

## కాటన్ స్ఫూర్తితోనే
# జలసంరక్షణ ఉద్యమాలు

- ఆయన స్ఫూర్తితోనే పోల‘వరం’
- కాటన్ 216వ జయంతి
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి



అమరావతి : సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ప్రజలు గుండెల్లో గుడి కట్టుకుని పూజిస్తున్న మహనీయుడు కాటన్ అని కొనియాడారు. నీటి విలువ, గొప్పదనం తెలిసిన గొప్ప వ్యక్తని.. ఆయన స్ఫూర్తితోనే నీరు-ప్రగతి వంటి జల సంరక్షణ ఉద్యమాలు ప్రారంభించామని పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాలను ధాన్యాగారాలుగా కాటన్ తీర్చిదిద్దారన్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి కాటన్ చరితార్థుడయ్యాడని వెల్లడించారు. ఆయన స్ఫూర్తితోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని తరువాయి 2లో..

# కిడ్నీ రాకెట్ కేసులో కీలక మలుపు

### గత మూడేళ్లలో 24 అవయవ దానాలు .. పలు విషయాలు వెలుగులోకి

విశాఖ సిటీ: తవ్వేకొద్దీ విశాఖ కిడ్నీ రాకెట్‌లో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒకటి రెండు కాదు గత మూడేళ్లలో కిడ్నీ మాఫియా ఏకంగా 24 అవయవదానాలు చేపట్టినట్లు విచారణలో తేలింది.

శ్రద్ధా ఆసుపత్రి వ్యవహారంపై విచారణకు జిల్లా కలెక్టర్ త్రిసభ్య కమిటీని విచారణకు నియమించారు. ఈ కమిటీ విషయాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి.

23 కిడ్నీ ఆపరేషన్లు చేసినట్లు ఇప్పటి వరకు ఆధారాలు సేకరించారు. దర్యాప్తు పూర్తి అయ్యేటప్పటికీ మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కిడ్నీ మార్పిడి కోసం బెంగళూరుకు చెందిన ప్రభాకర్ నుంచి రూ. 23 లక్షలు వసూలు చేశారు. మధ్యవర్తిత్వం నడిపిన డాక్టర్ మంజునాథకు రూ. 70 వేలు ఇచ్చినట్లు తేలింది. అయితే కిడ్నీ దానం చేసిన వ్యక్తికి హామీ ఇచ్చి, కొద్ది మొత్తం డబ్బు ఇచ్చి సరిపెట్టారు.

ఆరు నెలలు వేచిన తర్వాత బాధితుడు కేసు పెట్టడంతో ఈ కిడ్నీ రాకెట్ విషయం వెలుగులోకి వచ్చింది.

# భారీగా డ్రగ్స్ పట్టివేత



హైదరాబాద్: నగరంలోని జీడిమెట్ల దూలపల్లిలో అధికారు లు భారీగా డ్రగ్స్ పట్టు కున్నారు. ఓ మూత బడిన కంపెనీలో గుట్టు చప్పుడు కాకుండా మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు తరువాయి 2లో..

# రెచ్చిపోయిన ఇసుక మాఫియా

### వీఆర్వోలకు తీవ్ర గాయాలు .. కలెక్టర్ ఆగ్రహం



శ్రీకాకుళం కలెక్టరేట్: శ్రీకాకుళం జిల్లాలో ఇసుక మాఫియా రోజురోజుకూ రెచ్చిపోతోంది. ఇసుక మాఫియాకు చెందిన కొందరు వ్యక్తులు రెవెన్యూ ఉద్యోగులపై మంగళవారం రాత్రి దాడులకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. శ్రీకాకుళం గ్రామీణ మండలం నైర వద్ద ఇసుక అక్రమంగా తరువాయి 2లో..

## ఈసీ పారదర్శకంగా
# వ్యవహరించలేదు

### తప్పుపట్టిన కళా వెంకట్రావు



అమరావతి: ఈసీ తీరును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు తీవ్రంగా తప్పుపట్టారు.

ఎన్నికల సంఘం అధికారులు పారదర్శకంగా వ్యవహరించడం లేదని ధ్వజమెత్తారు. అడిషనల్ సీఈవో సుజాత శర్మను కళా వెంకట్రావు కలిశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 49 పోలింగ్ బూత్‌ల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేశారు. వీటిలో రీపోలింగ్ జరగాలని కోరారు. చంద్రగిరి నియోజకవర్గంలోని 166, 310 బూతులపై వచ్చిన ఫిర్యాదుపై సీఈవో విచారణకు ఎందుకు ఆదేశించారని అడిగారు. పోలింగ్ రోజున ఆ రెండు బూత్‌లపై టీడీపీ అభ్యర్థి నాని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

కానీ, పోలింగ్ అయిన 24 రోజుల తర్వాత వైసీపీ అభ్యర్థి కొన్ని బూత్స్‌పై ఫిర్యాదు చేస్తే సీఈవో విచారణకు ఆదేశించారు. అయినా రీపోలింగ్ అయ్యాక విచారణ ఏంటి? అని ప్రశ్నించారు. ఈసీ చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తోందని కళా వ్యాఖ్యానించారు. సీఈవో ద్వివేది సెలవు నుంచి వచ్చాక టీడీపీ ఫిర్యాదుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని సుజాత శర్మ హామీ ఇచ్చారు.

## ఓట్ల లెక్కింపులో
# అవకతవకలొద్దు

- తగిన జాగ్రత్తలు పాటించండి
- ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- అనంతరం ఈవీఎంలు
- తదుపరి వివి ప్యాట్ల స్లిప్పుల లెక్కింపు
- అధికారులకు శిక్షణా కార్యక్రమం



విశాఖపట్నం: భారత ఎన్నికల నియమ నిబంధనలకనుగుణంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జాగ్రత్తగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలక్టర్ కె.భాస్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక స్వర్ణభారతి అడిటోరియం, డా.బి.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు ఓట్ల తరువాయి 2లో..

## గీతంలో కాటన్ జయంతి

-- వార్త 8వ పేజీలో --









# ఆర్టీసీ బస్సు బోల్తా

**15మందికి గాయాలు**

**ఎస్పీ సంఘటనా స్థలి సందర్శన**

**ప్రమాదంపై ఆరా**



మల్హార్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండల పరిధిలోని టీవీనగర్ సమీపంలో బుధవారం ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో సుమారు 15 మంది ప్రయాణికులకు తరువాయి 2లో..

# మహాసంకల్పంతో పెద్దచెరువు శుద్ధిసేవ



విజయనగరం : పెద్దచెరువు శుద్ధిసేవను మహాయజ్ఞంగా భావించిన జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ మహాసంకల్పంతో పట్టుసడలించకుండా శుద్ధిసేవను కొనసాగిస్తున్నారు. మనచెరువును మనమే బాగుచేసుకుందామని జిల్లా కలెక్టర్ ఇచ్చిన పిలుపునకు అన్ని వర్గాల ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ ఇచ్చిన పిలుపుతో పెద్దచెరువు శుద్ధికి పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థలు బుధవారం తరలివచ్చాయి. మేముసైతం అంటూ శుద్ధిసేవలో భాగస్వాములయ్యారు. ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు పెద్దచెరువులో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే వాకింగ్ ట్రాక్‌కు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలను, పనికిరాని మొక్కలను తొలగించారు. ప్రతీఒక్కరికీ ముందుజాగ్రత్తగా గ్లౌజ్‌లు, మాస్కులను పురపాలక సంఘం తరపున పంపిణీ చేశారు. పురపాలక సంఘం సమకూర్చిన కొంకులు, కత్తులు, చెత్తసేకరణ కవర్లు, డబ్బాలు పట్టుకొని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అకుంఠిత దీక్షతో చెరువు పరిశుభ్రతకు పూనుకున్నారు. చెరువునుండి తొలగించిన వ్యర్థాలను పురపాలక సంఘానికి చెందిన ఐదు ట్రాక్టర్లు, రెండు ట్రిప్పర్లు సహాయంతో తరలించారు. కార్యక్రమం అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సెల్ఫీలు దిగి వారందరినీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దచెరువు శుద్ధి సేవ కార్యక్రమాన్ని సఫలీకృతం చేయడానికి చేయిచేయి కలిపి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎండిపోయిన మొక్కలు, ప్లాస్టిక్, చెత్తచెదారం తీయడం వలన చెరువు నీటి సామర్థ్యం పెరుగుతుందన్నారు. పెద్దచెరువు ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి ప్రజలు నడక, వ్యాయామం చేసేవిధంగా తీర్చిదిద్దుతామన్నారు. పెద్దచెరువు శుద్ధిసేవ ప్రక్రియ పదిరోజుల్లో జరిగేది కాదని నిరంతరం కొనసాగించినప్పుడే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, డిఎఫ్ఓ లక్ష్మణరావు, మున్సిపల్ డిఇ వంశీకృష్ణ, హెల్త్ ఆఫీసర్ డా.దీపక్, మావూరు విజయనగరం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.విశాల, ఐఎంఎ ప్రతినిధులు డా.జె.సి.నాయుడు, డా.మురళీమోహన్, హ్యూమన్‌రైట్స్ సంస్థ ప్రతినిధి ఎస్.అచ్చిరెడ్డి, లిఫ్టింగ్ హ్యాండ్స్ ప్రతినిధి కంది గౌరీశంకర్, సాధనా సంస్థ ప్రతినిధి పి.దుర్గాప్రసాద్, వ్యాట్ ఆర్గనైజేషన్ ప్రతినిధి ఎన్.పృధ్వీ, ఉత్తరాంధ్ర ఐక్యవేదిక ప్రతినిధి ఎం.సోంబాబు, చేయూత ఫౌండేషన్ ప్రతినిధి ఎం.రాము, వెంకటేష్, ఆర్.కల్పన, అక్రమ్, సంతోష్, పురపాలక పారిశుద్ధ్య సిబ్బంది, తాత్కాలిక సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

**- చోరీ సొత్తు స్వాధీనం - 2వ పట్టణ సిఐ డి. శ్రీహరిరాజు**



విజయనగరం: విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడ్ని, మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి, రిమాండుకు మే 15న తరలించినట్లుగా విజయనగరం 2వ పట్టణ సిఐ డి. శ్రీహరిరాజు తెలిపారు. ఈ సందర్భంగా విజయనగరం 2వ పట్టణ సిఐ డి. శ్రీహరిరాజు మాట్లాడుతూ నిందితుడు బులుసు సాయి కృష్ణ కాంత్ సాయి కుమార్ (23 సం॥లు) విజయనగరం పట్ట ణంలో ఉంటున్నట్లు, బి.టెక్ 2వ సం॥ వరకు చదువుకొని, చెడు వ్యసనాలకు అలవాటు పడి, చదువు మాని వేసినట్లు, తన జల్సాలకుదొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా ఆయన తెలిపారు. గతంలో విజయనగరం 2వ పట్టణ మరియు విజయనగరం 1వపట్టణ పోలీసు స్టేషను పరిధిల్లో అనేక దొంగతనాలకు పాల్పడి, కేంద్ర కారాగారంలో శిక్ష కూడా అనుభవించాడన్నారు. 2018లో జైలు నుండి రిలీజ్ అయిన తరువాత ఒక హత్యాయత్నం కేసులో విజయనగరం 1వ పట్టణ పోలీసులు అరెస్టు చేసారన్నారు. మళ్ళీ బెయిలుపై రిలీజ్ అయి విజయనగరం 2వ పట్టణ పరిధిలో ఇటీవల కాలంలో రెండు చోరీలకు పాల్పడినట్లుగా ఆయన తెలిపారు. చోరీ కేసుల్లో దొంగిలించిన 5 తులాల బంగారు ఆభరణాలు, ఎపి 35ఎఫ్ 7011 హీరోహొండా ప్లజర్ మోటారు సైకిలు, రెడ్‌మీ ఫోనులను అమ్మేందుకుగాను ప్రయత్నిస్తుండగా విజయనగరం2వ పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లుగా విజయనగరం 2వ పట్టణ సిఐ డి. శ్రీహరిరాజు తెలిపారు.

# ఎస్‌ఎస్‌సి పరీక్షలలో 147మంది ఉత్తీర్ణత

పెద్దాపురం : పెద్దాపురం పురపాలక సంఘ ఆధీనములో గల జెఎన్‌ఎమ్ హైస్కూలు మరియు సాగర్ మున్సిపల్ హైస్కూలు నుండి 2018-19 విద్యా సంవత్సరంనకు ఎస్‌ఎస్‌సి పరీక్షలకు 177మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 147మంది ఉత్తీర్ణత సాధించారు. జెఎన్‌ఎమ్ హైస్కూలు నందు చదువుతున్న రోషనాంజలి, ఎమ్.కామేశ్వరి అనే విద్యార్థులు 9.5 జిపిఎతో ప్రథమస్థానంలో నిలవగా అదే స్కూలుకి సంబంధించిన సిహెచ్.హర్షిత, ఎన్.ఆకాష్ అనే విద్యార్థులు 9.3 జిపిఎతో మరియు సాగర్ హైస్కూలుకు సంబంధించిన బి.సత్య వీర భవాని, టి.త్రివేణి అనే విద్యార్థులు 9.0 జిపిఎతో మొదటి స్థానంలో నిలువగా వి.మహాలక్ష్మి అనే విద్యార్థి 8.5 జిపిఎతో 2వస్థానంలో నిలిచారు. రెండు హైస్కూలుల నుండి 15 మంది విద్యార్థులు 9.0 జిపిఎ పైన సాధించారు. మన పెద్దాపురం పురపాలక సంఘ ఉత్తీర్ణత శాతం 83%గా నిలిచినది. 10వతరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికి ఛైర్‌పర్సన్ మరియు మున్సిపల్ కౌన్సిల్ వారు అభినందనలు తెలియజేశారు.

# పానల్ లాయర్స్, పారా లీగల్ వలంటీర్లుతో ఓరియంటేషన్ కార్యక్రమం



పెద్దాపురం : జిల్లా న్యాయసేవాధికార సంస్థ వారి ఆదేశానుసారం కె.రత్నకుమార్, సీనియర్ సివిల్ జడ్జి మరియు ఛైర్మన్, న్యాయసేవాధికార సంఘం, పెద్దాపురంవారు పానల్ లాయర్స్ మరియు పారా లీగల్ వలంటీర్లుతో ఆ కోర్టు ప్రాంగణంలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. జైళ్ళలో శిక్షను అనుభవిస్తున్న మరియు ఆయా కేసులలో ట్రయల్ జరుపబడుతున్న ముద్దాయిలకు స ంబంధించిన కుటుంబాల వారికి న్యాయపరమైన సేవలను అందించడం ఈ మీటింగ్ యొక్క ముఖ్య ఉద్ధేశ్యము. రత్నకుమార్ పానల్ లాయర్స్ మరియు పారాలీగల్ వాలంటీర్లు ఏ విధంగా తమ విధులను నిర్వర్తించాలో వివరించారు.

# అనాథాశ్రమం పిల్లలకు అల్పాహారం



భీమునిపట్నం : చిట్టివలస వాస్తవ్యులు కీ.శే. చిల్ల సూర్య నారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మూర్తి మధురవాడ సెల్టర్ హోమ్ అనాధాశ్రమం పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేసినందుకు వుయ్ కేర్ యు మరియు హెల్పింగ్ హేండ్స్ తరుపున ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమం లో మేరి, ఏలూరి రాంబాబు, అప్పలసూరి పాల్గొన్నారు.

### పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన

# జయహో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల

అనంతగిరి : జయహో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు 2019 సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ,జిల్లా పరిషత్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు కీర్తి పతాకాన్ని ఎగర వేసిన ఏజెన్సీ విద్యార్థినీ విద్యార్దులకు అభివందనాలు.ఉత్తమ ఫలితాలు సాదించిన అనంతగిరి మండలంలోగల బాల బాలికల అశ్రమ ఉన్నత పాఠశాలలు, కొత్త వలస, పినకోట, కెజిబివి. కొత్తూరు గుమ్మకోట గురు కులం, భీంపోలు,పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మహిళ ప్రధానోపాధ్యాయినిలకు, ఉపాధ్యాయులకు, యుటిఎఫ్ జిల్లా సహధ్యక్షులు శెట్టి రాంబాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు చీ.మల్లేశ్వరరావు, బాల కృష్ణ, కార్యకర్తలు, విద్యార్దుల తల్లి తండ్రులకు, విధ్యార్థులకు యుటిఎఫ్ అనంతగిరి మండల శాఖ హృదయపూర్వక శుభాకాంక్షలుమరియు అభినందనలు తెలిపారు.

# పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు



విజయనగరం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీపైడితల్లమ్మ వారి దర్శనానికి మంగళ బుధవారాల్లో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దేవర ఉత్సవం పిదప మంగళవారం తెల్లవారుఘూమున వనం గుడి నుండి చదురుగుడికి అమ్మవారిని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అధికసంఖ్యలో భక్తుల వచ్చి కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. భక్తుల తాకిడిని గమనించిన దేవస్థానం వెంటనే బారికేడ్లు ఏర్పాటుచేసింది. తిరువిధోత్సవం తర్వాత అమ్మవారి రాకతో మరలా పండగ వాతావరణం నెలకుంది.

# ఈనెల 21న శేషశాయి సంస్మరణ సభ

విజయనగరం : మధురవాచస్వి మానాప్రగడ శేషసాయి సంస్మరణ సభ ఈ నెల 21వ తేదీన స్థానిక గురుజాడ కేంద్ర గ్రంధాలయంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని విజయభావన, కౌముది పరిషత్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు సాహితీవేత్తలు, అభిమానులు విచ్చేయవలసిందిగా కన్వీనర్ పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# శ్రీ శారదావిద్యానిలయ విద్యార్థుల ప్రభంజనం



విశాఖపట్నం : నక్కవానిపాలెం క్రాంతినగర్‌లో శ్రీ శారదావిద్యానిలయంలో పదోతరగతి విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పి.నూకరాజు మాట్లాడుతూ 8మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారన్నారు. అలాగే 82 మంది 9.8 నుంచి 9.0, 53 మంది 8.8 నుంచి 8.0, 16 మంది 7.8 నుంచి 7.0 జీపీఏ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీడీఎల్ఎన్ శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మొదటి పేజీ తరువాయి

## ఓట్ల లెక్కింపులో అవకతవకలొద్దు

లెక్కింపుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా నిబంధనలకను గుణంగా విధులను నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవియంలు, ఈ టిపిబియస్(ఎలక్ట్రానికల్ ట్రాన్సిలేటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్) ద్వారావచ్చిన ఓట్ల లెక్కింపు, ఫలితాల విడుదలపై సవివరంగా తెలియ చేసారు. ఎన్నికల లెక్కింపు ప్రారంభంనుండి ఫలితాల విడుదల వరకు పూర్తిస్థాయిలో వీడియో చిత్రీకరణ చేపట్టాలన్నారు. అభ్యర్థులకు సమానంగా ఓట్లు వస్తే చేపట్టాల్సిన విధానాలను తెలియ జేశారు. లెక్కింపు మొత్తం రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలన్నారు. కౌంటింగ్ హాలులో ప్రతి రెండు ఫలితాలను కౌంటింగ్ ఏజెంట్లకు చూపించాలన్నారు. లెక్కింపులో పాల్గొన్న అభ్యర్థులు ఓటింగ్ పై గోప్యత పాటించాలన్నారు. లెక్కింపులో భాగంగా ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి ఫలితాలను ఫారం 20లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఈవీయంల లెక్కింపు చేపట్టాలన్నారు. ఆఖరులో వివి ప్యాట్ల స్లిప్పులను లెక్కించాలన్నారు. లెక్కింపుకోసం అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. ఫలితాల అనంతరం ఓటింగ్ యంత్రాలు, సీల్డ్ ట్రంకు పెట్టెలను జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించాలన్నారు. శిక్షణలో భాగంగా మాక్ కౌంటింగ్ ను నిర్వహించి సందేహాలను నివృతిచేసారు. చెరొక వైపు 7 టేబుళ్ళ చొప్పున 14 టేబుళ్లను ఏర్పాటుచేసి సూపర్వైజరు, సహాయ సూపర్వైజరు, మైక్రో అబ్జర్వర్లకు ఓట్ల లెక్కింపు పై శిక్షణను ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలక్టర్ జి.సృజన, పాడేరు సబ్ కలక్టర్ వెంకటేశ్వర్ , ఆర్ ఒలు పాల్గొన్నారు.

## కాటన్ స్ఫూర్తితోనే జలసంరక్షణ ఉద్యమాలు

వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 70 శాతం పూర్తి చేశామని గుర్తుచేశారు. జులై నుంచి గ్రావిటీ ద్వారా పోలవరం నీరు అందిస్తామని చెప్పారు. పోలవరం పూర్తయితే ఏపీ దశ, దిశ మారిపోతుందని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా నదుల అనుసంధాన కల నిజం చేశామని.. కృష్ణా డెల్టాలో కరవు ఛాయలను తరిమికొట్టామని గుర్తుచేశారు. ఐదేళ్లలో ఏపీలో 23 జలవనరుల ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేశామని వెల్లడించారు.

***కాటన్ మానవతావాది : లోకేశ్***

కాటన్ ఆశయాలే పోలవరం నిర్మాణంలో మనకు స్ఫూర్తి కావాలలని మంత్రి నారా లోకేశ్ ట్విటర్‌లో పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలోనే ధవళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని.. ఆనకట్ట, కాల్వ నిర్మాణం కేవలం ఐదేళ్లలోనే పూర్తిచేశారని పేర్కొన్నారు. కాటన్ మానవతావాది అని.. ఆయన సామాజిక సేవ, దార్శనికతను గుర్తు చేసుకుందామన్నారు.

## 27న రీవెరిఫికేషన్ ఫలితాలు

అనుమానం మళ్లీ రావచ్చునని పేర్కొంది. ఇప్పటికే విద్యార్థులు ఆందోళనగా ఎదురు చూస్తున్నారన్న బాలల హక్కుల సంఘం తరపు న్యాయవాది దామోదర్ రెడ్డి.. ఫలితాల్లో మరింత జాప్యం జరగవచ్చని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఫెయిలైన విద్యార్థుల రీవెరిఫికేషన్ ఫలితాలు, జవాబు పత్రాలు రెండూ ఒకేసారి చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రీవెరిఫికేషన్లో చాలా మంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతారని భావిస్తున్నామని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఫలితాల్లో గందరగోళానికి సంబంధించిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని గ్లోబరీనా సంస్థకు నోటీసులు జారీ చేసిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది.

## భారీగా డ్రగ్స్ పట్టివేత

ఆ కంపెనీపై దాడి చేశారు. కెటామిన్ పౌడర్ తయారీ చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అక్కడున్న సామాగ్రిని స్వాధీనం చేసుకుని, కెటామిన్ పౌడర్‌ను తయారు చేస్తున్నవారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

డ్రగ్స్ కేసులో ఎవరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదు!

టాలీవుడ్‌ను కుదిపేసిన మాదక ద్రవ్యాల కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టంచేశారు. ఈ కేసులో సినీ తారలు సహా ఏ ఒక్కరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదన్నారు. డ్రగ్స్ కేసులో 62 మందిని విచారించినా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదని, ఛార్జి షీట్‌లో సైతం బలమైన అంశాలను పొందుపరచలేదంటూ మీడియాలో ఇటీవల విస్తృతంగా జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సినీ తారలకు క్లీన్‌చిట్ ఇచ్చారన్న వార్తల్ని కొట్టిపారేశారు. డ్రగ్స్ కేసులో ఇప్పటివరకు ఏడు ఛార్జిషీట్లు దాఖలు చేశామని, ఐదుకు పైగా అభియోగ పత్రాలు దాఖలు చేయాల్సి ఉందని వెల్లడించారు. ఇంకా పలు ఆధారాలు రావాల్సి ఉందని స్పష్టంచేశారు. తమకు లభ్యమైన ఆధారాలను బట్టి ఎప్పటికప్పుడు అభియోగ పత్రాలు దాఖలుచేసి కోర్టుకు సమర్పిస్తున్నాం తప్ప ఎవరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఎవరినీ వదిలిపెట్టబోమని.. పూర్తి ఆధారాలతో ముందుకెళ్తున్నామని అధికారులు స్పష్టంచేశారు.

## రెచ్చిపోయిన ఇసుక మాఫియా

తరలిస్తున్న లారీలను పట్టుకునేందుకు వెళ్లిన గ్రామ రెవెన్యూ అధికారులపై మంగళవారం అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణాదారులు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో వీఆర్వోలు చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు గాయాలపాలవ్వగా.. మరో ఇద్దరు వీఆర్వోలు అక్కడ నుంచి పరుగులు తీశారు. తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎస్సై చిన్నంనాయుడు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి గ్రామస్థులతో మాట్లాడారు. అధికారులపై దాడులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గాయపడిన వీఆర్వోలను చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్వోలను జిల్లా కలెక్టర్ జె.నివాస్, జాయింట్ కలెక్టర్ చక్రధరబాబు బుధవారం ఉదయం పరామర్శించారు. ఈ ఘటనపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని, నిందితులను వదలబోమని హెచ్చరించారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా

గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గోదావరిఖని నుంచి భూపాలపల్లికి వెళ్తోంది. బస్సు టీవీనగర్ సమీపంలోని మానేరు వంతెన దాటుతున్న క్రమంలో అదుపు తప్పి వంతెన పక్కనున్న గొయ్యిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 15 మంది గాయాలపాలయ్యారు.

ఘటనపై సమాచారం అందుకున్న కొయ్యూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో క్షతగాత్రులను కాటారం, మహదేవ్‌పూర్, మంథని ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. 60 మందికి పైగా ప్రయాణికులు బస్సులో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. భూపాలపల్లి ఎస్పీ భాస్కరన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. ప్రమాదంపై ఆరా తీశారు.

# రాజకీయ దొంగలంతా ఏకమయ్యారు

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

విజయవాడ : మోదీ ప్రభంజనాన్ని అడ్డుకొనేందుకు రాజకీయ దొంగలంతా ఏకమయ్యారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. విజయవాడ ధర్నా చౌక్‌లో బీజేపీ నేతలు నిరసనకు దిగారు. కోల్‌కతాలో అమిత్ షా ర్యాలీపై జరిగిన దాడికి నిరసనగా ఆందోళన చేపట్టారు. డౌన్ డౌన్ మమతా బెనర్జీ అంటూ నినాదాలు చేశారు. ధర్నాలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడారు. మమత బెనర్జీపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మమతాను సమర్థిస్తున్న చంద్రబాబుపై కూడా ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు మళ్లీ బీజేపీకే పట్టం కట్టబోతున్నారని జోస్యం చెప్పారు.

# పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన ప్రధాని సోదరుడు

జైపూర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోదరుడు ప్రహ్లాద్ మోదీ ధర్నాకు దిగారు. తన కేటాయించిన సెక్యూరిటీ సిబ్బందికి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. జైపూర్ పోలీస్ కమిషనర్ ఆనంద్ శ్రీవాస్తవ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రహ్లాద్ మోదీ జైపూర్ నుంచి అజ్మీర్ వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రక్షణగా ఇద్దరు సెక్యూరిటీ ఆఫీసర్లను నియమించారు. రూల్ ప్రకారం సెక్యూరిటీ సిబ్బంది సంబంధిత వ్యక్తి వాహనంలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే ప్రహ్లాద్ మోదీ అందుకు నిరాకరించారు. సెక్యూరిటీ అధికారులు తన వాహనంలో వచ్చేందుకు ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ అధికారులకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జైపూర్-అజ్మీర్ జాతీయ రహదారిపై గల బగ్రు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు.

# గీతం సైన్స్ కోర్సుల ప్రవేశ ఫలితాలు విడుదల



సాగర్‌నగర్‌: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులలో ప్రవేశానికి మే 9వ తేదీన నిర్వహించిన గీతం సైన్స్ అడ్మిషన్ టెస్ట్ (జిశాట్-2019) ఫలితాలను బుదవారం ఇన్ ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా దాదాపు 5వేల మంది విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్ష రాసారని ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.శరత్‌చంద్రబాబు తెలిపారు.

ఇంటర్ బైపిసి సబ్జెక్టులతో ఉత్తీర్ణత అయిన విద్యార్థులకు బ్యాచులర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ (బిఇఎమ్), బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బిసిఎ), ఐదేళ్ల ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బిఎస్సీలో బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయెఇన్ఫర్మేటిక్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ కాంబినేషన్‌లతో కోర్సులను ఆఫర్ చేస్తున్నామని, అలాగే ఎంపిసి విద్యార్థులకు మేథ్స్,ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ కాంబినేషన్‌లతో బిఎస్సీ డిగ్రీ కోర్సులను ఆఫర్ చేస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వారికి ఎమ్మెస్సీలో అప్లైడ్ మేథ్స్, ఫిజిక్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్ సైన్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయెఇన్ఫర్మేటిక్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు.

కాగా దీనికి సంబంధించి అడ్మిషన్ కౌన్సిలింగ్ మే 30వ తేదీన నిర్వహిస్తున్నామని తెలిపారు. కోర్సులకు సంబంధించిన పూర్తి సమాచారం, కౌన్సిలింగ్ వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www.gitam.eduను పరిశీలించాల్సిందిగా ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజగోపాల్, సైన్స్ అడ్మిషన్ల డైరక్టర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 19న అన్నమాచార్యుని జయంతోత్సవం

డాబాగార్డెన్స్‌: ప్రేమసమాజం సమావేశ మందిరంలో శ్రీహరి సంకీర్తన సేవా సంస్థ అన్నమయ్య గీతాంజలి ప్రధాన కార్యదర్శి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ సారథ్యంలో 611వ అన్నమాచార్యుని జయంతోత్సవమును ఘనంగా నిర్వహించనున్నాము. అన్నమాచార్యుని జయంతోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రము ప్రధాన అర్చకులు శ్రీమాన్ జి.శేషాచార్య స్వామివారిచే శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వైభవము, ఆరవెల్లి శ్రీ సీతారామాచార్య స్వామి వారిచే అన్నమాచార్యుని సంకీర్తనల విశిష్ఠతపై ప్రసంగం ఏర్పాటు చేయడమైనది. తదుపరి సత్యరాజ్ సంగీతాలయ వ్యవస్థాపకులు డా॥ వై. బాల గణేష్ సంగీత సారథ్యంలో అన్నమాచార్యుని సంకీర్తన, శ్రీ విష్ణు సహస్రనామ సంకీర్తన సత్సంగం (నావల్ డాక్‌యార్డు ఉద్యోగులు) లచే సామూహికంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం జరుగనున్నదని ఎం.వి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు హాజరు అవుతున్నారు. వీరితోపాటు నగరానికి చెందిన వంకాయల సన్యాసిరాజు, మట్టపల్లి హనుమంతరావు, నందిక శ్రీనివాసరెడ్డిలు అతిథులుగా పాల్గొంటున్నారు.

కావున అన్నమాచార్య సంకీర్తనాభిమానులు, కళాభిమానులు యావన్మంది పాల్గొని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహన్ని, అన్నమాచార్యుని మంగళాశాసనాన్ని పొందమని కోరుచున్నాము.

# వృద్ధులు, అనాథలను ఆదరించాలి

### విశాఖ హెల్పింగ్ ట్రస్ట్ ప్రారంభించిన ఆచార్య వెలగపూడి



విశాఖ సిటీః నిస్సహాయ స్థితిలో దుర్భర జీవితం అనుభవిస్తున్న చిన్నారులు, వృద్ధులు, వికలాంగులు, యాచకుల తమదైన శైలిలో సేవ చేయాలన్న లక్ష్యంతో యువకులు ఓ సేవా సంస్థను నెలకొల్పడం ప్రశంసనీయమని ఆంధ్ర విశ్వవిద్యాలయ విశ్రాంతాచార్యులు డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం ఉదయం ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో విశాఖ హెల్పింగ్ ట్రస్ట్ ఉమామహేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. ప్రముఖ సంఘ సేవకురాలు చెక్కా రమాదేవి మాట్లాడుతూ సేవాభావంతో యువత ముందుకు రావాలని, ఇది విద్యార్థి దశలోనే సాధ్యపడుతుందని సూచించారు. ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకులు చెన్నా తిరుమల రావు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సహాయపడే చేతులు మిన్న అన్న మదర్ థెరిసా సూక్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెన్నా గౌరీ శంకర్, మామిడి తేజేశ్వరరావు, మహ్మద్ కాళీ, అవినాష్, ఎం.సుజాత, వారాడ సుమ, నక్కా జోత్స్న, యశస్విని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీచ్‌రోడ్డు, బస్ షెల్టర్‌లు, ఆర్టీసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లు కూడలిలో వున్న వృద్ధులు యాచకులకు భోజనం, పండ్లు పంపిణీ చేశారు.

# సాధనతోనే ఏదైనా సాధ్యపడుతుంది

### వాగ్దేవి విద్యార్థులకు ఘన సత్కారం




అక్కయ్యపాలెంః వాగ్దేవి టాలెంట్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉన్నతమైన ఫలితాలను సాధించిన వాగ్దేవి విద్యార్థులకు ఘన సత్కారం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్మన్ భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు హాజరు అయినారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతీ విద్యార్థి చదువుపై శ్రద్ధ పెట్టి చక్కని సాధన చేస్తే ఉన్నతమైన ఫలితాలను పొందగలరు అన్నారు.

చక్కని లక్ష్యంతో ముందడుగు వేసి విద్యార్థులు బాగా రాణించాలి అని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆద్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి అత్యున్నతమైన లక్ష్యంలో బాగా చదువుకొని అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. వీరితో పాటు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వి.వి.సత్యనారాయణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.ఎస్.ఎల్. శైలజ సి.హెచ్. కృష్ణమూర్తి, ఎస్.సోమరాజు, వి.హెచ్.పి.జె.ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిధి వి.సన్యాసిరాజు వైజాగ్ పటం క్లబ్ తరపున వాగ్దేవి పాఠశాల తరుపున పదో తరగతిలో విజేతగా నిలిచిన ఈ. భవానికి రూ. 10,000/-ల నగదును మరియు పాసైన వారందరికి వెండి లక్ష్మి ప్రతిమలను అందజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు ఎం.మణి, విద్యార్థులు, ఆధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 21న కొయ్యూరు మండల సమావేశం

కొయ్యూరుః ఈ నెల 21న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ రహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో 11 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఎంపిపి గొలిసింగి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరవ్వాలని ఆయన కోరారు.

# డ్రైవర్ కుమారుడికి 10/10

### అభినందించిన సిఐ రేవతమ్మ



నర్సీపట్నంః డ్రైవర్ కుమారుడికి పదో తరగతిలో 10/10 పాయింట్లు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ అన్నారు. బుధవారం రూరల్ సిఐ కార్యాలయంలో వడ్డాది ప్రవీణ్‌కుమార్ (హోంగార్డు కుమారుడు)ని ప్రశంసించారు. స్థానిక రెల్లివీధి వాస్తవ్యుల్లో మేధావులు రావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. అంతే కాకుండా అంగన్వాడీ అసోసి యేషన్ (ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం. అప్పలరాజు, డిహెచ్‌పిఎస్ నాయకులు దినేష్ తదితరులు అభినందించారు.

# నీటి ఎద్దడి నివారణకై ప్రభుత్వ ప్రణాళిక శూన్యమే

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి



నర్సీపట్నంః రాష్ట్రంలో నీటి ఎద్దడి నివారణకై ప్రభుత్వ ప్రణాళిక, ముందు చూపు చర్య లేక రైతులు, ప్రజలు విలవిలలాడుతున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి ఆరోపించారు. బుధవారం ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లోని నీటి వనరులను సందర్శించారు. ఉపాధి కూలీలతోమమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల పంట నష్టం భారీగా ఉంటుందన్నారు. తాగునీరుకే ప్రశ్నార్ధకంగా ఉన్న పరిస్థితుల్లో ప్రత్యామ్నాయం పట్ల అధికారులు దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి, కనీసం రోజుకి రూ.200లు కూలీ రావడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు రాజాన దొరబాబు, రామునాయుడు, గురుబాబు, అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు, రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, నర్సీపట్నం మండల కార్యదర్శి రుత్తల పెదబుజ్జి, గొలుగొండ, నర్సీపట్నం మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాతవరంలో పూరిల్లు దగ్ధం

### 40వేల ఆస్తి నష్టం



నాతవరంః నాతవరం రామాలయం దగ్గర పూరిల్లు అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన వేములపూడి శ్రీనుకు చెందిన పూరిల్లు ఉదయం వంట చేస్తుండగా మంటలు చెలరేగి పూరిల్లు కాలిపోయింది.

దీంతో ఇంట్లోని టీవీ, ఫ్యాన్ గృహోపకరణాలు కాలిపోయాయి.

ఈ ప్రమాదంలో సుమారు 40 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని శ్రీను తెలిపారు.

# కొయ్యూరులో 99.9శాతం ఉత్తీర్ణత

కొయ్యూరుః పదో తరగతి పరీక్షలో మండలంలో 99.9శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని 11 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాల, ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలు కలిసి 14 పాఠశాలలకు చెందిన 564 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 563మంది పాసయ్యారు. కొయ్యూరు గురుకుల పాఠశాలలో 67 మంది 67 మంది ఉత్తీర్ణులయ్యారు.

వీరిలో 9.7 జిపిఎతో కొయ్యూరుకు చెందిన ఓ.సోమేష్‌కుమార్ మండల ద్వితీయ స్థానందక్కించుకున్నారు. అలాగే కొయ్యూరు సిఏహెచ్‌లో 68 మంది హాజరవ్వగా 68 మంది, కొయ్యూరు బాలురు ఆశ్రమ పాఠశాల-2లో 22 మంది హాజరవ్వగా 22 మంది, నడింపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమంలో 37 మందికి 37 మంది, శరభన్నపాలెం బాలుర ఆశ్రమ పాఠశాలలో 37 మందికి 37 మంది, చిట్టింపాడులో 21 మందికి 21 మంది, రావణాపల్లి బాలికల ఆశ్రమంలో 79 మందికి 79 మంది, వైఎన్.పాకలలో 51 మందికి 51 మంది, పి.మాకవరంలో 27 మందికి 27 మంది, రామన్నపాలెంలో 18 మందికి 17 మంది, కొమ్మికలో 20 మందికి 20 మంది, కస్తూర్బా గాంధీ పాఠశాలలో 27 మందికి 27 మంది, కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 27 మందికి 27 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పి.ఇంద్రప్రసన్న 9.8, బి.సాయిప్రియ, ఎస్.నాగభార్గవి 9.7 జి.శ్రీలేఖ 9.5 జిపిఏ సాధించి పాఠశాల టాపర్లుగా నిలిచారు. బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 మందికి 25 మంది ఉత్తీర్ణులయ్యారు. ఏపిఆర్ స్కూల్‌కు చెందిన షణ్ముక ఓమేశ్వరరాజు 9.7 సాధించి మండల బాలురలో ప్రథమంగా నిలిచారు.

# రావికమతంలో 97శాతం ఉత్తీర్ణత

రావికమతం : మండలంలో పదో తరగతి ఫలితాల ఉత్తీర్ణత శాతం 97శాతం వచ్చాయి. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ముగ్గురికి 10/10 పాయింట్లు రాగా ప్రైవేటు పాఠశాలలో ఇద్దరికి పది పాయింట్లు వచ్చాయి. మోడల్ స్కూల్లో 79 మందికి 79 మంది పాసై 100 శాతం ఉత్తీర్ణత సాధించగా కొల్లూరు భానుచంద్ర, పెద్దాడ మౌనికకు 10 పాయింట్లు వచ్చాయి. రావికమతం బాలికల హైస్కూల్లో 59 మందికి 52 మంది పాసై 88 శాతం, గర్నికం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో 46 మందికి 46 పాసై శతశాతం, చినపాచిలలో 70కి 70 మంది పాసై శతశాతం, రావికమతం హైస్కూల్లో 163 మందికి 161 మంది(99శాతం), టి.అర్జాపురం పాఠశాలల్లో 93 మందికి 87 మంది(84శాతం). టి.అర్జాపురం పాఠశాలల్లో 93 మందికి 87 మంది(84శాతం), జెడ్.కొత్తపట్నంలో 38కి 36 మంది(95శాతం), తోటకూరపాలెంలో 20కి 20 మంది, మేడివాడ హైస్కూల్‌ల్లో 104 మందికి 96 మంది(92 శాతం), దొండపూడి హైస్కూల్లో 75 మందికి 73 మంది(97శాతం), కొత్తకోట హైస్కూల్లో 174 మందికి 168 మంది(97) శాతం ఫలితాలు సాధించారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
అద్దెకు వాహనం
టెండరు ప్రకటన నెం. eT-HQ-WAT-06-2019, తేది. 09.05.2019
₹ 7,34,489.13.
₹ 14,700/-
₹ 2,360/-
06.06.2019న 1330 గంటలకు
http://www.ireps.gov.in
డివిజనల్ రైల్వే మేనేజరు (ఇంజనీరింగ్), వాల్తేరు
PR-81/K/19-20

## 10వ తరగతి ఫలితాలలో ప్రతిభ విద్యాలయం ఓ ప్రభంజనం

### 39 మంది విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధించారు



సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దరి ఉన్న ప్రతిభ విద్యాలయం లో 2019 మార్చ్ 10వ తరగతి పరీక్ష ఫలితాలు శత శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల విద్యార్థులు మరోమారు జయకేతనం ఎగుర వేసి తన సత్తాచాటి చెప్పారు 100% ఉత్తీర్ణత పాటు 39 మందికి పదికి పది పాయింట్లు సాధించి పట్టణ ప్రాంతంలో ఉన్న కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా జయకేతనం ఎగుర వేసి సత్తా చాటి చెప్పారు మొత్తం పాఠశాల విద్యార్థులు 134 మంది శత శాతం ఉత్తీర్ణత సాధించారు 9.8 25 మంది 9.7 21 మంది 9.5 19మంది 9.3 9మంది 9.2 7 మంది 9.0 6 మంది 8.2 4 మంది 8.7 3 మంది 8.5 ఒకరు ఉత్తీర్ణత సాధించారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ మాట్లాడుతూ గత సంవత్సరం 35 మంది పదికి పది పాయింట్లు సాధించామన్నారు.

ఈ ఘన విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా విద్యతోపాటు ఉన్నత విలువల నేర్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను కోరారు పాఠశాల ప్రిన్సిపాల్ అన్ని జోసప్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు విద్యార్థులు సమిష్టి కృషితో అద్భుత ఫలితాలు సాధించామని అన్నారు.

# కౌంటింగ్ ఏజెంట్లకు తెలుగుదేశం శిక్షణ



విశాఖపట్నం : ఓట్ల లెక్కింపు లో అనుక్షణం అప్రమత్తం గా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై తెలుగుదేశం పార్టీ బుధవారం నుంచి శిక్షణా కార్యక్రమం చేపట్టింది. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గా లకు నగర పార్టీ కార్యాలయం లో ఉదయం ఒకటి మధ్యాహ్నం ఒకటి చొప్పున రోజుకు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున శిక్షణ చేపడుతున్నారు. తొలి రోజున ఉదయం విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులకు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు, పోస్టల్ ఎలక్షన్ ఏజెంట్స్ మరియు లీగల్ ఏడ్వాయిజర్లకు ప్రత్యేకంగా శిక్షణ నిర్వహించారు. మధ్యాహ్నం విశాఖ దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ చేపట్టారు. కౌంటింగ్ జరుగుతున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎప్పుడు ఎలా వ్యవహరించాలి, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఎలా ఉంటుంది, బ్యాలెట్ పరిగణనలోకి తీసుకోవడం లో ఏమేమి చూడాలి, తదితర అంశాల గురించి ఈ శిక్షణ లో వివరించారు.

ఓట్ల లెక్కింపులో ఏలాంటి పొరపాట్లు జరగకుండా చూసేందుకు ఏ జాగ్రత్తలు తీసుకోవాలని కౌంటింగ్ ఏజెంట్ల కు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎస్.ఏ.రెహమాన్, ఎమ్మెల్యే లు హాజరయ్యారు. రేపు 16 వ తేదీ ఉదయం విశాఖపట్నం తూర్పు, మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం ఉత్తర అసెంబ్లీ నియోజక వర్గాల కౌంటింగ్ ఏజెంట్ల కు శిక్షణ నిర్వహిస్తారు.

# విజయభాను

## సంపాదకీయం

### తెలంగాణంలో విద్యాప్రగతి

రాష్ట్ర అవతరణ తర్వాత సమస్త రంగాల్లో తనదైన ప్రత్యేకతను చాటుతూ దూసుకుపోతున్న తెలంగాణ విద్యారంగంలోనూ గుణాత్మక మార్పును సాధించింది. పదో తరగతి ఫలితాల్లో మున్నెన్నడూ లేనివిధంగా 92.43శాతం ఉత్తీర్ణతతో ప్రత్యేకతను చాటడం ముదావహం. ఎప్పటిలాగే పదో తరగతి ఉత్తీర్ణతా శాతంలో బాలికలే పై చేయి సాధించారు. మొత్తంగా చూస్తే పదో తరగతి ఫలితాలు గతేడాదితో పోలిస్తే ఈసారి 8.65 శాతం ఎక్కువ ఉత్తీర్ణత నమోదై విద్యాప్రగతిని చాటిచెప్పాయి. రాష్ట్ర వ్యాప్తంగా 4,374 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదై ప్రభు త్వ రంగంలో విద్యావికాసానికి తార్కాణంగా నిలిచాయి. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 99.73 శాతం ఉత్తీర్ణతతో జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. జగిత్యాల జిల్లా వరుస గా మూడోసారి అగ్రస్థానంలో నిలువగా, హైదరాబాద్ అట్టడు గున ఉండటం గమనార్హం. పాఠశాల విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యమిచ్చి అన్నివర్గాల విద్యార్థులకు ఉన్న త ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు అనేక చర్యలు తీసుకున్నది. దీనిలో భాగంగానే బడుగు బలహీనవర్గాల పిల్లల కోసం రెసిడెన్షియల్ స్కూళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల కోసం ప్రత్యేక వసతి గృహ పాఠశాలలు, మైనారిటీ వర్గాల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాల లు స్థాపించి సమస్త వర్గాల్లో విద్యాభివృద్ధికి చేసిన కృషికి నిదర్శనంగా పదో తరగతి ఫలితాలను చెప్పుకోవచ్చు. విద్యాభివృద్ధి రాశిలోనే కాదు వాసిలోనూ స్పష్టంగా కనిపిస్తున్నది. కేవలం బట్టీ చదువులు కాకుండా నూతనంగా ప్రవేశపెట్టిన సీసీఈ పద్ధతిలో అత్యధిక జీపీఏ పాయింట్లు సాధించడం పాఠశాల విద్యలో వచ్చిన గుణాత్మక మార్పునకు నిదర్శనం. గత ఏడాది పదో తరగతిలో 4,768 మంది మాత్రమే పది జీపీఏ సాధిస్తే, ఈ ఏడాది 8,676 మంది ఈ ఘనతను సాధించారంటే విద్యలో వచ్చిన గుణాత్మక మార్పును అర్థం చేసుకోవచ్చు. ఎక్కువ మందికి తెలియని విషయమేమంటే రిజిస్ట్రేషన్ చట్టం 1908 ప్రకారం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ అయ్యేది కేవలం దస్తావేజులు మాత్రమే. స్థిరాస్తి హక్కుల టైటిల్‌ను నమోదు చేసే అధికారం రిజిస్ట్రార్లకు లేదు.రాష్ట్ర ప్రభుత్వం గత యాభై ఏండ్లలో లేని విధంగా ఈ ఐదేండ్లలో రెట్టింపు సంక్షేమ హాస్టళ్లు, వివిధ వర్గాలకు గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేసి బడి ఈడు పిల్లలంతా తరగతి గదిలోనే ఉండేట్లు చర్యలు తీసుకున్నది. దీంతో రాష్ట్రంలో ఇది వరకు బడికిపోని సమస్తవర్గాల పిల్లలంతా విద్యాబుద్ధులు నేరుస్తున్నారు. తెలంగాణ సమాజ సమగ్రాభివృద్ధికి పునాదిగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యతో వేసిన తొలి అడుగులు విజయవంతమయ్యాయనటంలో ఎటువంటి సందేహం లేదు. పాఠశాల విద్య పదో తరగతి ఫలితాలతో ప్రారంభమైన ఈ విద్యాకాంతులు తెలంగాణ సమాజాన్ని తేజోవంతం చేస్తాయి. సమాజాభివృద్ధి కొలమానాలలో అక్షరాస్యతకున్న ప్రాధాన్యం విస్మరించలేనిది. అయినా స్వాతంత్ర్యానంతర కాలంలో ఏడు దశాబ్దాల తర్వాత కూడా ఇప్పటికీ అనేక ప్రాంతాలు విద్యావ్యాప్తిలో ఎంతో వెనుకబడి ఉండటం విషాదకరం. విద్యాభివృద్ధి కోసం ప్రణాళికల్లో కేటాయింపులు కూడా కంటితుడుపుగానే ఉం టున్నాయన్న విమర్శ కూడా ఉన్నది. అయితే మిగతా సామాజికాభివృద్ధిని పట్టించుకోకుండా విద్యారంగ అభివృద్ధి మాత్రమే సాధ్యం కాదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతోపాటు పాఠశాల విద్య లో విప్లవాత్మక మార్పును సాధిస్తున్నది. ఐదేం డ్ల కాలంలో విద్యావికాసం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ఎంతో విశిష్టమైనవి, ప్రత్యేకమైనవి. గతంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లు అంటే కనీస సౌకర్యాలు లేకుం డా ఉండే హాస్టల్ భవనాలతో పాటు, నీళ్ల చారు, పురుగుల అన్నం అన్నట్లుగా ఉండేవి. ప్రతి విద్యార్థికి అన్నం కూరలు కొలిచి పెట్టేవారు. దీంతో విద్యార్థులు సగం కడుపునకు తిని ఆకలితో అలమటించేవారు. ఈ కడు హీనమైన పరిస్థితుల నేపథ్యంలో ఎంతోమంది విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువులు కొనసాగించలేక ఇంటికి పారిపోయి బాలకార్మికులుగా మారిన దుస్థితి ఉండేది. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చేసింది రాష్ట్ర ప్రభుత్వం. సన్న బియ్యంతో విద్యార్థికి కడుపునిండా భోజనం పెట్టడానికి చర్యలు తీసుకున్నది. నిర్దిష్టమైన మెనూతో పౌష్టికాహారం అందిస్తూ విద్యార్థులను శారీరకంగా, మానసికంగా దృఢం గా, ఆరోగ్యకరంగా ఉండేట్లు విద్యార్థులను తీర్చిదిద్దే కార్యక్రమం ఓ మహా యజ్ఞంలా సాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం గత యాభై ఏండ్లలో లేని విధంగా ఈ ఐదేండ్లలో రెట్టింపు సంక్షేమ హాస్టళ్లు, వివిధ వర్గాలకు గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేసి బడి ఈడు పిల్లలంతా తరగతి గదిలోనే ఉండేట్లు చర్యలు తీసుకున్నది.

## ఆటోలకు ప్రత్యేక స్టిక్కర్లు పంపిణీ

### : జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్



విజయనగరం: జిల్లా పోలీసుశాఖ మహిళల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ బుధవారం నాడు తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఆటోలలో ప్రయాణించే మహిళలపై దాడులు జరుగుతున్న దృష్ట్యా, నేరాలను నిరోధించేందుకు అప్రమత్తం అయిన జిల్లా పోలీసుశాఖ ట్రాఫిక్ పోలీసులఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లుకు ప్రత్యేకంగా రూపొందించిన స్టిక్కర్లును జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ జిల్లా పోలీసుకార్యాలయం వద్ద మే 15న అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ - మహిళలపైదాడులను నిరోధించేందుకు,మహిళలకు రక్షణగా నిలిచే చట్టాల పట్ల మహిళలకు, కళాశాలలు, పాఠశాలల మహిళా విద్యార్థినులకు 'మహిళా రక్షక్'బృందాలు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆటోలలో ప్రయాణించే ఒంటరి మహిళలు, వృద్ధులుకు అవసరమైన సమయంలో పోలీసుల సహాయాన్ని పొందే విధంగా ఆటో డ్రైవరు పేరు, వారి తండ్రి పేరు, ఆటో యజమాని పేరు, చిరునామా, ఆటో నంబరు, మొబైల్ నంబరు, ఆధార్ నంబరు, సహాయం పొందాల్సిన పోలీసు ఫోను నంబర్లుతో ప్రత్యేకంగా రూపొందించిన స్టిక్కర్లును ఆటోల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆటోలలో ప్రయాణించేప్రయాణికులకు కనిపించే విధంగా ఈ స్టిక్కర్లును ఏర్పాటు చేయడం వలన, ప్రయాణికులు ఆటో ఎక్కిన వెంటనే ఆటోలోపోలీసులు ఏర్పాటు చేసిన స్టిక్కరుకు ఫోటో తీసి, తమ తల్లిదండ్రులకు లేదా వారి రక్షణ గురించి ప్రత్యేక శ్రద్ధ వహించే వ్యక్తులకు వాట్సాప్‌లకు చేయాలన్నారు. ఆటోలో ప్రయాణించే సమయంలో మహిళల రక్షణకు ఏమైనా ఇబ్బంది ఏర్పడినపుడు, వారు పంపిన వాట్సాప్‌తో ఆటో, డ్రైవరు వివరాలును సులువుగా ట్రాక్ చేసి, మహిళలకు తక్షణమే పోలీసులు రక్షణ కల్పించే అవకాశం ఉంటుందన్నారు. పోలీసుశాఖ చేపడుతున్న చర్యలకు ఆటో డ్రైవర్లు, వాటి యజమానులు సహకరించాలని, ఇలా చేయడం వలన నిజాయితీ వ్యవహరించే ఆటో డ్రైవర్లుకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఉంటాయన్నారు. తప్పు చేసిన వ్యక్తులు మాత్రమే పోలీసులను చూసి భయపడాలని, నిజాయితీగా వ్యవహరించే వారికి పోలీసులు ఎప్పుడూ అండగా నిలుస్తారన్నారు. ఈ స్టిక్కర్లును పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని జిల్లాలో అన్ని ఆటోలలో ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల రక్షణకు జిల్లాలో 'మహిళా రక్షక్' బృందాలకు త్వరలో 'శక్తి టీం'లు జతకానున్నాయని జిల్లా ఎస్పీ తెలిపారు. 'శక్తి టీం'లలో పనిచేసే మహిళా కానిస్టేబుళ్ళుకు డిజిపిగారి ఆదేశాలతో ఇప్పటికే కరాటే, స్విమ్మింగు, డ్రైవింగు, ఆకతాయిల నుండి అమ్మాయిలను రక్షించడంలో కొన్ని మెళకువలతో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మహిళా రక్షక్, శక్తి టీంలకు బబ్బిలి ఎఎస్పీ గౌతమీ శాలీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, ఆటోలలో స్టిక్కర్లు ఏర్పాటు చేయడంలో బబ్బిలి ఎఎస్పీ కృషిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## టెన్త్ పరీక్షల్లో విశ్వతేజ విజయఢంకా








విశాఖపట్నం : ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో తాటిచెట్లపాలెంలోగల విశ్వతేజ పాఠశాల విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉత్తీర్ణులయ్యారు. అక్కడ ఉపాధ్యాయలు సుశిక్షుతులై విద్యార్థులకు మంచి చదువు నేర్పించడంతో పాటు మంచి భవిష్యత్తును కూడా తీర్చిదిద్దుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ తెలియజేశారు. పాఠశాలలో 71 మంది విద్యార్దులు పరీక్షలు హాజరయ్యారు. కాగా అందులో ఆరుగురు విద్యార్దులు 10కి 10 మార్కులు సాధించారు. ఐదుగురు 9.8 పాయింట్లతో పాస్ కాగా, మరో ఐదుగురు 9.7 పాయింట్లు సాధించారు. విజయం సాధించిన విద్యార్దులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పది పరీక్షల్లో విజయంసాధించిన 'రవి' కిరణాలు

విశాఖ సిటీ : స్థానిక ద్వారకానగర్‌లో గల రవీంద్రభారతి పాఠశాలలో 134 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో ఎక్కువ శాతంమంది 10కి 10 మార్కులు సాధించారు.

పాఠశాల చైర్మన్ ఎంఎస్ మణి విద్యార్దులకు అభినందనలు తెలిపారు. 10 మంది విద్యార్దులకు 10 మందికి జిపిఎ, తొమ్మిది మందికి 9.8 జిపిఎ సాధించారని జోనల్ ఇన్‌ఛార్జి వెంకటేష్ తెలిపారు. పాఠశాల జనరల్ మేనేజర్ జి.ఆర్. వసంత, డీన్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ మీనా మిశ్రా, ఏజిఎం జిఎస్ఎన్ మూర్తి విద్యార్దులకు అభినందనలు తెలిపి ఇకముందు పరీక్షలలో మంచి మార్కులతో పాసై మీరు చదువుతున్న పాఠశాలల లేదా కళాశాలలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్దులకు హితవు పలికారు.

## కవి సమయం

### యువత

కాలం విలువ తెలుసుకో
కాలానికి అనుకూలంగా మసులుకో
దురలవాట్లకు అవకండి మీరు బానిసలు
తల్లిదండ్రులు పెట్టుకున్నారు మీ మీద ఆశలు
అప్పులు చేసి మరి చదివిస్తున్నారు చదువులు
వాళ్ళకి చెడ్డపేరు తేవద్దు మీరసలు
కావాలి మీరు అవినీతిని అరికట్టే సింహాలు
కావొద్దు మీరు ఉగ్రవాద పోషకులు
కాలం విలువ తెలుసుకో
కాలానికి అనుకూలంగా మసులుకో

... కవితా రచన
వైదా ఈశ్వరరావు

## పంచాంగం

మాసం : వైశాఖ తిథి : ద్వాదశి ఉ.7.21 ; త్రయోదశి తె.5.31; చిత్ర తె.3.59; ప.వ.12.44ల 2.16. | గురువారం 16-05-2019

**మేషం:** ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదు ర్కొనక తప్పదు. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు.

**వృషభం** : రాజకీయాల్లో వారి కార్యక్రమాలు వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవుతారు. మీ సరదాలు కోరికలు వాయిదావేసుకోవాల్సివస్తుంది భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది.

**మిథునం** :వ్యాపారాల్లో గణనీయమైన పురోభవృద్ధి సాధిస్తారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతాయి. కలప, సిమెంట్, ఇసుక రంగాలలో వారికి లాభదాయకం. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టలు అనుకూలిస్తాయి. స్త్రీలకు ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

**కర్కాటకం** : స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలకు అనుకూలం. ఖర్చులు బాగా పెరిగే ఆస్కారం ఉంది. ధన వ్యయంలో ఏకాగ్రత అవసరం. ప్రముఖుల కలయిక సాధ్యము కాదు. ఉద్యోగస్తులు సమర్థవంతంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఇసుక కాంట్రాక్టర్లకు అధికారుల నుంచి ప్రతికూలతలు ఎదుర్కొంటారు. మీ ఔన్నత్యాన్ని ఎదుటివారు గుర్తిస్తారు.

**సింహం** : బ్యాంకు పనుల్లోను, వాహనం నడుపు తున్నప్పుడు ఏకాగ్రత వహించండి. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఒక శుభకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీల, ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనిపిస్తుంది.

**కన్య** :కోర్టు వ్యవహారాలు పరిష్కరించబడుతాయి. రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపుల వల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. క్రయ విక్రయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తుల వారికి మంచి గుర్తింపు, శ్రమకు తగిన ఆదా యం లభిస్తుంది. స్త్రీలకు తమ మాటే నెగ్గా లన్న పంతం అధికంగా ఉంటుంది. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి.

**తుల** : ఏజెంట్లు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మిశ్రమ ప్రతిఫలంగా ఉంటుంది. మిమ్ములను చిన్నచూపు చూసిన వారే మీ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోయే ఆస్కారం ఉంది. నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగుతాయి. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి, చుట్టుపక్కల వారి ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం** : స్త్రీలకు ఏ విషయంలోను మనస్థిమితం అంతగా ఉండదు. కుటుంబీకుల మధ్య అనురాగవాత్సల్యాలు పెంపొందుతాయి. నిరుద్యోగులు భేష జాలకు పోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. మీ సంతానం చదువుల కోసం ధనం బాగా వెచ్చిస్తారు. మీరు ఎవరికీ ఎటువంటి హామీలు ఇవ్వడం శ్రేయస్కరం కాదు.

**ధనుస్సు** : ఉద్యోగస్తులు తోటివారితో విందులు, శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఇతరులపై ఆధారపడటం మంచిది కాదని గమనించండి. మీ సంతానం పై చదువులు, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు.

**మకరం** : వృత్తి, ఉద్యోగ విషయాల్లో అందరితో స్నేహంగా ఉండే ప్రయత్నం చేయండి. భవిష్యత్తుకు ఉపయోగపడే నూతన పరిచయాలు బాగా జరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. ఫైనా న్సు, బ్యాంకుల నుంచి పెద్ద మొత్తం ధనం డ్రా చేసే విషయంలో జాగ్రత్త వహించండి. కుటుంబ సభ్యుల ఆరోగ్య నిమిత్తం ఖర్చులు పెరుగుతాయి.

**కుంభం** : ఉద్యోగస్తులకు కొత్తగా వచ్చిన అధికారులతో సత్సంబంధాలు నెల కొంటాయి. ఖర్చులు ఊహించినవి కావడంతో ఇబ్బందు లంతగా ఉండవు. ఉపాధ్యాయులు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కా రమవుతాయి.

**మీనం** : బ్యాంకు చెక్కులు ఇచ్చే విషయంలో పునరాలోచన మంచిది. కుటుంబీకుల మధ్య స్వల్ప విషయమే చిలికి చిలికి గాలి వానలా మారుతుంది. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది

## బాబాను దర్శించిన యోగులు



### సంకీర్తన

శ్రీ సుబ్బరాయ మహోదయులు

వారు ఆ పుస్తకాన్ని చూసి అటువంటి అనుభూతులు తనకెన్నో కలిగినాయని చెప్పారు. ఆ పుస్తకంలోని సన్నివేశాలన్నీ నిజంగా జరిగినవే అని కూడా అన్నారు.

ఒకసారి గురూజీ అనుచరులు కొందరు కలిసి వారిని షిరిడీ యాత్రకు తీసుకునివెళ్ళారు. ఒక మెర్సిడెస్ కారులో వెనుకసీటులో వారిని ఒక్కరినే కూర్చొనబెట్టి ముందుసీట్లో తీర్థయాత్ర ఏర్పాటుచేసిన వ్యక్తి, కారు డ్రైవర్ కూర్చున్నారు. ఆ కారు వెనుక మరి రెండు మెర్సిడెస్ కార్లు, నాలుగు అంబాసిడర్ కార్లు, ఒక మినీబస్ మిగిలిన భక్తులతో వస్తున్నాయి. ఒక గంట ప్రయాణం తరువాత ఆ యోగి వెనుకకు తిరిగి కూడా వస్తున్న వాహన బృందాన్ని చూసి, తనకు ప్రత్యేకంగా ఇంత సుఖంగా షిరిడీయాత్ర ఎందుకు సంభవమయింది అని ఆలోచింపసాగారు. వెంటనే ఆయన కళ్ళను చేతులతో కప్పుకున్నారు. అప్పుడు తాను క్రితం జన్మలో బొంబాయి నుండి షిరిడీకి ఎనిమిదిసార్లు నడిచి వెళ్ళినట్లుగా ద్యోతకమయింది. ఆయన క్రితం జన్మలో పడిన శ్రమకు ప్రతిఫలంగా ఈ సుఖ ప్రయాణభాగ్యం కలిగిందని అప్పుడు బాబా ఆయనకు చెప్పారు.

గురూజీ ' ఈ కొండల్లో ఒక సాధువు ఉన్నాడు. ఆయన నన్ను పిలుస్తున్నాడు. కొంచెం ఆహారం సిద్ధంగా ఉంచండి. మనం ఆయన దగ్గరకు వెళ్ళి ఆయనకు ఈ ఆహారం అందించి వద్దాము' అని కార్లన్నీ ఒకచోట ఆపించారు. ఎగుడుదిగుడుగా ఉన్న బాటపై 20 నిముషాలు నడిచి వెళితే క్రింద నాలుగైదు చిన్నగుహలు ఉన్నాయి. అక్కడ ఒ సాధువు ఆరుగురు శిష్యులతో ఉన్నారు! గురూజీ సాధువు పాదాలకు నమస్కరించి తమని ఎందుకు రమ్మన్నారని గురూజీ ఆ సాధువును అడిగారు. ఆయన ఏదో చెప్పారు. అది ఎవరికీ అర్థం కాలేదు. అక్కడ సాధువు ఉన్నట్లు గురూజీకి ఎలా తెలిసిందా అని అందరికీ ఎంతో ఆశ్చర్యం కలిగింది!

ఆ యోగివర్యులు జ్యోతిషశాస్త్రంలో దిట్ట. ఆయన మా అమ్మగారి జాతక చక్రం పరీక్షించి, ఆమె గురుదశను చూడదని, 1995 సంవత్సరం తరువాత ఆమెకు ఏమయినా కావచ్చునని ఆయన వెల్లడించారు. మరికొందరు జ్యోతిష్యులు కూడా ఆమె జాతకం చూసి ఆమె జీవితకాలం 60సంవత్సరాలు మాత్రమే అని చెప్పారు. మా అమ్మగారి ఆయుర్ధాయం గురించి ఏమయినా చేయమని గురూజీని పదేపదే ప్రాథేయపడ్డారు.

ఆయన కొంచెంసేపు కళ్ళు మూసుకుని, ఆమె జాతకంలో గురుదశ చూసే అవకాశమే లేదని ఉద్ఘాటించారు. నేను కదలకుండా ఏదైనా దోవచూపమన్నాను. దానికి సమాధానంగా ఆయన 'స్వామిని ప్రార్థిస్తూ, ఉండు, వేరే మార్గం లేదు' అని చెప్పారు. అప్పటినుండి ప్రతిరోజు, ప్రతి సందర్భంలోను అమ్మను దీర్ఘాయుష్మురాలుగా దీవించమని స్వామితో ప్రార్థనల ద్వారా మొరపెట్టుకొంటూ ఉన్నాను. అప్పుడప్పుడూ స్వామి దయ పొందటానికి నా ప్రార్థన సరి పోతుందా అని సంశయం కలు గుతూ ఉండేది. రెండు సంవ త్సరాల తరువాత ఒక సారి నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో స్వామి చక్కగా ఒక కుర్చీలో కూర్చొని ఉన్నారు. వరుసగా తన దగ్గరకు ఎంతోమంది జనం వస్తుండగా స్వామి వారందరికీ వరాలు, బహుమతులు ప్రసాదిస్తున్నారు. స్వామి నన్ను చూసి 'నీకు ఏం కావాలి?' అని అడిగి ఆయనే వెంటనే 'ఎప్పుడూ అమ్మ ఆయుష్షు, అమ్మ ఆయుష్షు, ఆయుష్షు ఇచ్చాను పో' అన్నారు! ఇప్పుడు మా అమ్మ వయస్సు 75 సంవత్సరాలు. స్వామి దయవల్ల ఆమె ఎంతో ఆరోగ్యంగా, ఆనందంగా ఉంది. నాకు స్వామి దివ్యసన్నిధికి దారి చూపినవారు

యోగివర్యులు శ్రీ సుబ్బారావు గురూజీ. ఆయన సాన్నిహిత్యం ఏర్పడటము, ఇప్పుడు నిరంతరము సాయి భక్తుల సత్సాంగత్యంలో ఉంటూ, సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ఉండటం ఇదంతా బాబా అనుగ్రహం అనటంలో ఎటు వంటి సందేహం లేదు అంటరు. మెకానికల్ ఇంజనీర్, ప్రశాంతి సొసైటీ సభ్యులు శ్రీ సతీష్ దేశాయ్ మహోదయులు

...సశేషం


బాబ్జి

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## నిందితుడ్ని అరెస్టు చేయుటంలో క్రియాశీలక పోలీసులకు అభినందనలు

: జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్

విజయనగరం: పలు చోరీ కేసుల్లో నిందితుడు, పాత నేరస్థుడు బులుసు సాయి కృష్ణకాంత్‌ను అరెస్టు చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ బుధవారం నాడుఅభినందించి, ప్రోత్సాహక నగదు రివార్డులను అందజేసారు. రెండు చోరీ కేసుల్లో నిందితుడిను పట్టుకోవడంలోను, అతని వద్ద నుండి 5 తులాల బంగారు ఆభరణాలు, హీరో హెూండా మోటారు ప్లజర్‌మోటారు సైకిలు, రెడ్‌మీ ఫోను స్వాధీనం చేసుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన విజయనగరం 2వ పట్టణ ఎఎస్‌ఐ సిహెచ్.ఎస్.ఎన్. రాజు, హెచ్‌సి వేణు నాయుడు, కానిస్టేబుళ్లు ఎల్. రాంబాబు, ఇస్మాయిల్, ఎఫ్‌ఒపి వై. ఉమా మహేశ్వరరావులను జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో అభినందించి, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, విజయనగరం డిఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్, విజయనగరం 2వ పట్టణ సిఐ డి. శ్రీహరిరాజు పాల్గొన్నారు.

## వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) సమ్మర్ క్యాంపు

విశాఖపట్నం : ఈ నెల 17,18,19 తేదీలలో స్టీల్ ప్లాంట్‌లో 3 రోజుల పాటు సమ్మర్ క్యాంపు జరుగుతున్నతున్నది. ఈ క్యాంపు కి 10 వ తరగతి ఆ పైన చదువుకున్నవారు హాజరు కావచ్చు. సమాజంలో ప్రాధాన్యత కల్గిన అంశాలు గుర్తించడం వాటికీ కాన్సెప్ట్ డెవలప్ చెయ్యడం, క్రియేటివ్ డిజైన్, సైంటిఫిక్ టెంపర్ మెంట్, సొసైటీ డెవలప్మెంట్, సాంస్కృతిక కార్యక్రమాలు (పాటలు, డాన్సు, మైమ్, చిరునాటికలు, డప్పు) యువత నేటి సవాళ్లు. కెరీర్ గైడెన్స్, వాటితో పాటు ఇన్నోవేటివ్ థింకింగ్ డెవలప్ చేసే వివధ అంశాలు వుంటాయి. పరీక్షలు అయిపోయాయి. ఫలితాలు కూడా దాదాపుగా వచ్చేశాయి. ఇక ఇప్పుడు ఎంచుకోవలసినది మార్గం, లక్ష్య నిర్దేశన. విద్యార్థుల ఆలోచనలకు రూపం ఇవ్వడం కోసం, భావ వ్యక్తీకరణ, సమాజం, కుటుంబం పట్ల అవగాహన మరియు భాద్యత తెలియజేసే ఉద్దేశ్యంతో ఈ సమ్మర్ క్యాంపు నిర్వహణ జరుగుతున్నది. దేనినైనా చెయ్యగలిగేటట్లు, ధైర్యంగా ఎదుర్కో గలిగేటట్లు విద్యార్థులను ఉత్తేజాన్నివ్వడం, ఆ దిశగా వారి చదువు, ఆలోచనలు వుండే విధంగా ప్రణాళిక వేసుకునేందుకు ఈ క్యాంపు వారికి సహకారం అందిస్తుంది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100. రెసిడెన్షియల్ ప్రోగ్రాం అవసరమైన వస్తువులన్నీ తెచ్చుకోవాలి, పెన్, పుస్తకం, దుప్పట్లు మొ,,. వివరాలకు 9966641065, 94943 55979 ను సంప్రదించవచ్చని కన్వీనర్ ఎం.వి.సత్యకుమారి తెలిపారు.

## హనుమాన్ చాలీసా పోటీల విజేతలు వీరే



విజయనగరం: రామనారాయణం ప్రాంగణం సీఈఓ టి ఎల్ ఎన్ మూర్తి, పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావుల పర్యవేక్షణలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం విజ్ఞానభారతి పాఠశాలలో ఏర్పాటుచేసిన హనుమాన్ చాలీసా కంఠస్థ పోటీలలో ప్రథమ స్థానాన్ని 9వ తరగతికి చెందిన జె.గాయత్రి, ద్వితీయ స్థానాన్ని 1వ తరగతికి చెందిన పి.సాయి సనత్, తృతీయ స్థానాన్ని 5వ తరగతికి చెందిన ఎ.జనార్ధన్ కార్తీక్ కైవసం చేసుకోగా కన్సొలేషన్ బహుమతులకు పి.సుప్రదీప్, ఎ.సూర్యప్రభలు ఎంపికయ్యారు. న్యాయనిర్ణేతగా తెలుగుభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ వ్యవహరించారు. విజేతలకు ఈ నెల 29వ తేదీన హనుమజ్జయంతి నాడు రామనారాయణంలో బహుమతులను అందచేస్తారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సి.హెచ్.విమల, ప్రాంగణం పిఆర్‌ఓ ఎంవి రమణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

**I, YELLA VIJAYA SREE, W/o.Yella Ratna Sekhar, Annapurna Gardens, Opp.Govt. Hospital, Ward No.71, GVMC, Pendurthi, Visakhapatnam - 531173, do hereby declared that changed my old name YELLA VIJAYA SRI to new name YELLA VIJAYA SREE I request all to consider my name YELLA VIJAYA SREE**

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMILI**
**O.S. 8/2017**

**Between :**
**Sagarapu Srinivas ...Plaintiff**
**And**
**Pitta Venkata Ratnam ...Defendant**

**NOTICE**

**To,**
**Pitta Venkata Ratnam, W/o.Pitta Venkata Ramana Reddy, Hindu, aged 45 years, D.no:7-371/7, Venkata Sai Nagar, Vepagunta, Visakhapatnam-530047.**

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **06-06-2019 at 10.30 AM** for your appearance on that day, the matter will be heard and determined in your absence basing on the material available in the court.

**Sanapala M.M.M.Krishna, M.V.Ramana**
**Advocates,**
**Visakhapatnam.**
**Cell No: 73822 30309.**

# హోం కంపోస్టుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంకల్ప సొసైటీ డిసి కృష్ణ

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి, సంకల్ప సొసైటీ సభ్యులకు, మహిళలకు హోం కంపోస్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చెత్త నుండి సంపద తయారు చేసుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ మున్సిపల్ సిబ్బందికి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలన్నారు ప్రతి ఒక్కరు ఇంటివద్ద తడి చెత్తను కంపోస్టు ద్వారా ఎరువును తయారు చేసుకుని ఇంటి వద్ద పూల మొక్కలకు, కూరగాయల మొక్కలకు వేసి పండించవచ్చునన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు ఇంటి వద్ద కంపోస్ట్ తయారు చేసుకోవాలన్నారు. సంకల్ప సొసైటీ డిసి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి చెత్తను కంపోస్ట్ చేసి ఎరువు తయారు చేసుకోవాలని కోరారు. అనంతరం కృష్ణ తక్కువ ఖర్చుతో కంపోస్ట్ తయారు చేసే ఏ పద్ధతిని విపులంగా వివరించారు.

# ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అజయ్‌బాబు

నాతవరం : ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.అజయ్‌బాబు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు మాసర్ల రాజు అధ్యక్షతన బుధవారం మండలంలోని ఎస్‌బి.పట్నం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు పని ప్రదేశంలో ప్రభుత్వం కల్పించిన కూలీల సౌకర్యార్థం సేఫ్టీ కిట్లు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. పని చేసిన పనికి తగ్గ వేతనం దక్కలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుందన్నారు. కూలీలకు కావల్సిన సౌక ర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. కనీస వేతనం రూ.600 ఇవ్వా లని, జాబ్ కార్డుకు 200 రోజులు పని కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పేద ప్రజల పక్షాన నిరంతరం అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం.రాజు, ఇ.మాణిక్యం, వరలక్ష్మి, దేవుడమ్మ పాల్గొన్నారు.

# దివ్యాంగుల సదరం ధృవపత్రంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**: జె.సి.వెంకటరమణారెడ్డి**



విజయనగరం : దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల స్లాట్ బుకింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు ఉంటాయని జాయింట్ కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. మీ-సేవ (కియోస్క్) ఆపరేటర్లు ఎటువంటి లోపాలు లేకుండా తమ విధులు నిర్వర్తించాలని అన్నారు. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల స్లాట్ బుకింగ్ సర్వీసుపై అవగాహన సదస్సును బుధవారం కలక్టరేట్ ఆడిడటోరియంలో నిర్వహించారు. దివ్యాం గుని ఆధార్‌ను నిశితంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఆపరేటర్లు దురుసుగా వ్యవహరించరాదని అదనపు పైకం వసూలు, నిర్లక్ష్యధోరణి వహిస్తే క్షమించేది లేదని ఆయన హెచ్చరించారు. మీ-సేవ కేంద్రాల్లో మొదటి ప్రాధాన్యత వారికే ఇవ్వాలని అన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఆపరేటర్లు సర్టిఫికెట్ల నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్ల మంజూరీలో నెలకొన్న సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 450 పైచిలుకు మీ సేవా కేంద్రాలు ఉన్నా, ఇప్పటికి కేవలం 100 మంది నిర్వాహకులే హాజరైన నేపధ్యంలో త్వరలో వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తున్నామని అన్నారు. మండల కేంద్రంలో ఆయా మండలాల మీ-సేవా నిర్వహకులు వీడియో కాన్ఫరెన్సుకు తప్పని సరిగా హాజరై వివరాలు అవగతం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ధృవపత్రాల మంజూరుకు సంబంధించిన స్లాట్ బుకింగ్, వైకల్యం, నిర్ధారణ, వైకల్య శాతం, వైద్యపరీక్షలు తదితర అంశాలు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.జి.ఉషశ్రీ వివరించారు.

# భీమిలిలో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం




భీమునిపట్నం : అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం భీమిలి ఎస్ ఎస్ ఓ ఎస్ చిల్డ్రన్స్ విలేజ్ భీమిలి ఆద్వర్యం లో బుధవారం నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల పరిరక్షణ చట్ట ప్రకారం నో చైల్డ్ ఎలోన్ అనే నినాదముతో శిభిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ గృహ హింస శాఖాదిపతి బి.జ్యోతిలత, బ్రెడ్ సంస్థ సెక్టర్ కోఆర్డినేటర్ డి.వరలక్ష్మి, మాన సిక శాస్త్రవేత్త డాక్టర్ జెట్లీలు పాల్గొన్నారు. ఈ శిబిరం ద్వారా సుమారు రెండు కోట్ల మంది పిల్లలు తల్లిదండ్రులు లేక ఇబ్బంది పడుతున్నారని, ఇటు వంటి పిల్లల యొక్క రక్షణలో నిర్లక్ష్యం చేస్తే ఈ సంఖ్య 2.4 కోట్లకు చేరు తుందని తెలిపారు. ఈసంద ర్భంగా జ్యోతి లత మాట్లా డుతూ పిల్లలు పెంపకం లో తల్లి కుటుంబం ప్రధాన పాత్ర వహించాలని కుటుంబం నైతిక విలువలను అలవర్చు కుంటే గృహ హింసను నివారించ వచ్చని తెలియజేశారు. వరలక్ష్మి మాట్లా డుతూ మహిళలు బాధ్య తతో ఉన్నప్పుడే కుటుంబ కలహాలు రావని సమిష్ట కుటు ంబం లో సమస్యలు వుండేవి కావని అన్నారు.ఈ కార్యక్రమం లో సంస్థ ప్రతినిధులు కె.దుర్గ రాజు ,వి సత్యనారాయణ, సుమారు 150 మంది మహిళలు పాల్గొన్నారు.

# జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ

**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ భాస్కర్, అన్ని పాఠశాలలు అమలుచేసి తీరాలన్న డిఇఓ**



విశాఖపట్నం: జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ కల్పిస్తూ కలెక్టర్ కె.భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా (2019-20) విద్యా సంవత్సరానికి సంబంధించి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని వైజాగ్ జర్నలిస్టుల ఫోరం పాలకవర్గం ఇటీవలే జిల్లా కలెక్టర్ కె.భాస్కర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీంతోపాటు గత కొన్నేళ్లుగా ఫీజు రాయితీ కల్పిస్తున్న మెమో ఉత్తర్వులను కలెక్టర్‌కు వీరు అందజేశారు. ఈ నేపధ్యంలోనే సానుకూలంగా స్పందించి 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి అక్రిడేటెడ్ జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ కలెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రతిని బుధవారం వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబుకు డిఇఓ అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాల్సిందేనన్నారు. ఒక వేళ ఏవైనా పాఠశాలలు అందుకు నిరాకరించినట్లయితే జర్నలిస్టులు తమ దృష్టికి తీసుకురావాలని డిఇవో కోరారు. ఈ సందర్భంగా విజెఎఫ్ కార్యదర్శి ఎస్.దుర్గారావు, ఆర్.నాగరాజు పట్నాయక్, టి.నానాజీ, దాడి రవికుమార్, పి.ఎన్.మూర్తి, కార్యవర్గసభ్యులు డిఇఓ లింగేశ్వరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తర్వులు అందుకున్నవారిలో కార్యవర్గ సభ్యులు ఎమ్ఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదు గ్రామ పంచాయతీల్లో ప్రజాభిప్రాయ సేకరణ

భీమునిపట్నం : విశాఖ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గ్రేటర్ విశాఖపట్నం కార్పరేషన్ నందు విలీనం చేయడానికి ప్రజాభిప్రాయ సేకరణకు ఈ గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అదికారుల అధ్యక్షతన గ్రామ సభ జరుగునని ఇ ఓ ఎం. అప్పల రాజు తెలిపారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలలకు కాపులుప్పాడ లోను,తొమ్మిది గంటలకు కె నగరప్పాలెం, పదిన్నరకి చేపలుప్పాడ, తొమ్మిది గంటలకు నిడి గట్టు, పదిన్నరకి జే.వి.అగ్రహారంలలో జరుగుతాయని అయాయ పంచాయతీ ప్రజలు ఈ గ్రామ సభకు హాజరు కావాలని ఆయన కోరారు.

# సాయి తేజస్వి ప్రతిభ




తేజస్వికి స్వీట్ తినిపిస్తున్న తల్లి దండ్రులు

విశాఖపట్నం : అక్కయ్యపాలెం దరి అబిద్‌నగర్‌కి చెందిన ఎస్‌ఆర్ డిజి పాఠశాల విద్యార్థిని, మానాపురం హేమసాయి తేజస్వికి పదవతరగతి పరీక్షా ఫలితాలలో పదికి పది జిపిఎ మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. తేజస్వి తండ్రి టాక్స్ కన్సెల్టెంట్. తల్లి సుజాతదేవి గృహిణి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చదవడం వలన ఈ ర్యాంక్ సాధ్యమైందని భవిష్యత్‌లో సిఎ చదవాలని తన లక్ష్యమని తేజస్వి చెప్పింది.

## పార్టీ కార్యాలయానికి ప్రభుత్వ కార్యాలయానికి తేడా తెలియదా 17వ వార్డు కౌన్సిలర్ స్వామినాయుడు



నర్సీపట్నం : నర్సీపట్నం తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ గవిరెడ్డి రమణకు పార్టీ కార్యాలయంనకు ప్రభుత్వ కార్యాలయంకు తేడా తెలియదా అని మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ స్వామినాయుడు ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయంలో ఏ ప్రజా ప్రతినిధి అయిన ప్రజలైన కావలసిన సమాచారం తీసుకునే హక్కు అందరికి ఉందన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ కార్యాలయం తెలుగుదేశం పార్టీ కార్యాలయం కాదన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లి ఓటరులిస్ట్ తీసుకున్నందుకు రాద్దాంతం చేస్తున్నారన్నారు. సంవత్సర కాలంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు పై జరుగుతున్న వివక్ష సెక్రటరీగా చెప్పుకుంటున్న మీరు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడుకి తెలియకుండా పట్టణంలో అనేక కార్యక్రమాలు నిర్వహించిన తెలుగు తమ్ముళను ఆయన ఎందుకు నిలదీయలేదన్నారు. సన్యాసిపాత్రుడు పార్టీ నుండి దూరం చేసే ఎత్తుగడలో భాగంగానే వైసిపితో లాలూచీ పడుతున్నారని ప్రచారం చేస్తున్నారని అంతే తప్ప మరే విషయం కాదన్నారు. ఈ విషయం అంతా ప్రజలు గ్రహిస్తారని తెలిపారు. గత సంవత్సర కాలంగా నోరుమెదపని జనరల్ సెక్రెటరి వెంకటరమణ ఇప్పుడు విలేకర్ల సమావేశం పెట్టి ఎందుకు గోల చేస్తున్నారన్నారు. ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే తాను చదువుతున్నారన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం ప్రజల కార్యాలయం అని తెలుగుదేశం పార్టీ కార్యాలయం కాదని ఆయన గ్రహించాలని సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## పిడుగు పడి నాలుగు పాడి గేదెల మృతి



గొలుగొండ : మండలంలో బుధవారం మధ్యాహ్న సమయంలో నాలుగు పాడిగేదెల పై పిడుగు పడడంతో మృతి చెందాయి. మండలంలో గాదంపాలెం పంచాయితీ శివారు విప్పలపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నల్లబెల్లి శ్రీనివాసరావుకు చెందిన నాలుగు గేదెలు పిడుగు పడిన ప్రమాదంలో మృతి చెందాయి. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో వ్యవసాయ భూముల్లో మేతమేస్తున్న పాడి గేదెలపై వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన పాడి గేదలు సుమారు రెండు లక్షల రూపాయలు విలువ ఉంటాయని యజమాని శ్రీనివాసరావు తెలిపారు. మృతి చెందిన గేదెలకు బీమా లేకపోవడంతో శ్రీనివాసరావు తీవ్రంగా నష్టపోయాడు.

## ఆసుకవిత్వంలో అగ్రగాములు కొప్పరవు కవులు

### విశాఖ వేదికగా పలు సేవా కార్యక్రమాలు పీఠం వ్యవస్థాపకులు మాశర్మ



విశాఖపట్నం : తెలుగునాట, ఆసుకవిత్వంలో కొప్పరవు కవులు అగ్రగాములుగా నిలిచారని పీఠం వ్యవస్థాపకులు మాశర్మ కొనియాడారు. బుధవారం ఉదయం ఆర్కేబీచ్ ప్రాంగణంలో వున్న కొప్పరవు కవులు విగ్రహాలకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుతో కలిసి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా మాశర్మ మాట్లాడుతూ అలనాడు గంటకు 500 పద్యాలు చెప్పి ఎంతోమంది ప్రముఖులను, ప్రజలను మెప్పించిన ఘనత కొప్పరవు కవులదేనన్నారు. అప్పట్లోనే వారికి 40 గుర్రపుబండ్లుతో, సైనికుల బందోబస్తుతో పలువురు రాజుల నుంచి ఘనస్వాగతం లభించేదనన్నారు. కొప్పరవు కవుల పీఠం ద్వారా ప్రతిఏటా విశాఖ వేదికగా ఎంతోమంది ప్రముఖులను ఆహ్వానించి ఘనంగా సత్కరిస్తున్నామన్నారు. వారికి ఇదే సమయంలో అవసరమైన ప్రోత్సాహము అందజేస్తున్నామన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ బీచ్‌రోడ్‌లో వున్న కొప్పరవు విగ్రహాల ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామన్నారు. కొప్పరవు కవుల గొప్పతనాన్ని నేటితరం ప్రజలకు తెలియజేసేందుకు పీఠం తరపున తమవంతు కృషిచేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో విశాఖ వేదికగా మరన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు పీఠం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## రాకోటి సేవలు మరువలేనివి: మళ్ళ



సింధియా: వైకాపా సీనియర్ నాయకుడు రాకోటి రాజేశ్వరరావు వైకాపా పార్టీ బలోపేతానికి చేసిన సేవలు మరువలేనివని పశ్చిమ వైకాపా అసెంబ్లీ అభ్యర్థి డా. మళ్ళ విజయప్రసాద్ అన్నారు. జీవీయంసీ 48వ వార్డులో నివాసం ఉంటున్న వైకాపా సీనియర్ నాయకులు రాకోటి రాజేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం మృతిని కుటుంబాన్ని మళ్ళ పరామర్శించారు. ఈసంధర్బంగా మళ్ళా మాట్లాడుతూ వార్డు పరిదిలో జరిగే పార్టీ కార్యక్రమంలో రాకోటి చురుకుగా పాల్గోనేవాడని, పార్టీ బలోపేతానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. విధివసాత్తు మననుంచి దూరం కావడం దురదృష్టమని ఆవేదన వ్యక్తం చేసారు. రాకోటి కుటుంబానికి పార్టీ అండగాఉంటుందని అన్నారు. పరామర్శించినవారిలో వైకాపా నాయకులు కన్నబాబు, బద్రినాద్, పీలా అనంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



సింధియా: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని జీవీయంసీ 46వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా వెంకటరమణ యాదవ్ సూచించారు. దోమలపై దండయాత్రలో కార్యక్రమంలో భాగంగా బుధవారం వార్డు పరిధిలో ఏదురువానిపాలెం, పిలకవానిపాలెం, శ్రీరామ్‌నగర్, తదితర ప్రాంతాలలో ఇళ్ళలలో నీటి నిల్వల సమస్య, పారిశుధ్య సమస్యలను పరిశీలించారు. ఈ సంధర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా వెంకటరమణయాదవ్ మాట్లాడుతూ నీటి నిల్వలపై పై కప్పు అమర్చుకోవాలని, నీటి నిల్వలు రోజుల తరబడి ఉంచుకోకూడదని దీని వలన దోమల లార్వాలు వృద్ది చెంది, దోమల పుడతాయని, దోమకాటువలన అనారోగ్యం పాలవుతామని హెచ్చరించారు. నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీవీయంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా విభాగపు సిబ్బంది వీధికాలువలో దోమల మందును చల్లారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా అమ్మకాలపై దాడులు



గాజువాక: స్టీల్‌ప్లాంట్ పోలీస్టేషన్ పరిధిలో నిషేదిత గుట్కాల అమ్మకాలపై స్టీల్ ప్లాంట్ పోలీసులు దాడులు నిర్వహించారు. బుధవారం సి.ఐ.పర్యవేక్షణలో ఎస్సై శ్యామలరావు, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. షాపులను దుకాణాలను తనిఖీ చేసారు. అమ్మకాలు నిర్వహిస్తున్న వారిని అదుపులోనికి తీసుకొన్నామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. స్టేషన్ పరిధిలో విచ్చల విడిగా గుట్కాలు అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం వచ్చింది. సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు సి.ఐ. తెలిపారు. నిషేధిత గుట్కా, పాన్‌పరాగ్, ఖైని తదితర అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై శ్యామలరావు హెచ్చరించారు. అటువంటి సమాచారం ఏదైన వుంటే పోలీసులకు తెలిపి సహకరించాలని కోరారు.

## లఘు ప్రయత్నానికి 80 అంతర్జాతీయ అవార్డులు

### ఏయూ పూర్వవిద్యార్థి ఆర్ట్ డైరెక్టర్ రమణకు అరుదైన గౌరవం

### లివింగ్ ఐడల్‌కు అంతర్జాతీయ ఖ్యాతి

ఆంధ్రవిశ్వవిద్యాలయం : చిత్రకళావిభాగం(ఫైన్‌ఆర్ట్స్) పూర్వ విద్యార్థి పి.వి.ఎం రమణ చేసిన లఘు ప్రయత్నానికి అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు వరించాయి. దర్శక, నిర్మాతగా నిర్మించిన లఘుచిత్రం లివింగ్ ఐడల్‌కు అంతర్జాతీయ స్థాయిలో 80 అవార్డులు లభించాయి. తన తదుపరి చిత్ర నిర్మాణంలో భాగంగా ఆయన విశాఖ విచ్చేసారు. ఈ సందర్భంగా తాను నిర్మించి, దర్శకత్వం వహించిన లింవిగ్ ఐడల్ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర విశేశాలను తెలియజేశారు.

కథాంశం...

బెంగాల్ ప్రాంతానికి చెందిన శిల్పకారుల జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని ఈ లఘుచిత్రాన్ని నిర్మించారు. దైవాన్ని మలచే చేతులు తమ జీవితాన్ని మలచుకోలేకపోతున్నాయి. అహంకారం, వ్యసనాల బారినపడి మనిని తనలోని మానవత్వాన్ని కోల్పోయి, మృగంగా మారుతున్నాయి. దైవం దీనికి సమాధానం ఇస్తుంది. జీవితం అర్థం అయ్యే సమయానికి కాలం గతించిపోతుంది. పశ్చాత్యాపం, పరివర్తనతో వ్యక్తిలో మార్పు వస్తుంది. భార్య వెలకట్టలేని సంపదని తెలుసుకుంటాడు. తనలోని రౌద్రాన్ని శాంతంగా మార్చిన దైవాన్ని నమస్కరించి మౌనంగా నిలచిపోతాడు. దైవాన్నికి మౌనంగా సంభాషిస్తాడు. ఇది సూక్ష్మంగా లఘుచిత్రం కథాంశం.

80 అవార్డులు...

రమణ ఆర్ట్ డైరెక్టర్‌గా 30కిపైగా చిత్రాలకు పనిచేసారు. తన ఆలోచనల నుంచి ఉద్భవించిన కథలకు రూపం ఇచ్చే పనిలో ఉన్నారు. దీనిలో భాగంగా తొలి ప్రయత్నంగా లఘుచిత్రాన్ని నిర్మించాలని భావించారు. బెంగాల్ కళాకారుల జీవితాలు ప్రతిబింబిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కేవలం రెండు



రోజుల్లోనే చిత్రీకరణ పూర్తిచేశారు. పోస్ట్ ప్రొడక్షన్‌కు సుమారు నాలుగు నెలల కాలం వెచ్చించారు. చిత్రానికి సంగీత దర్శకునిగా తెలుగు వ్యక్తి జె.వి వరప్రసాద్ పనిచేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా చిత్రాన్ని తీర్చిదిద్దాలని భావించారు. హిందీ, తెలుగు భాషల్లో దీనికి తెరకెక్కించారు. యూట్యూబ్‌లో ఉంచిన ఈ లఘు చిత్రానికి 4.5లక్షల మంది వీక్షకులు ఉన్నారు. భారతీయ చిత్రం ఖ్యాతిని ఇనుమడింపచేసే విధంగా లఘు చిత్రాల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది. ఆర్ట్ ఫిల్మ్‌లు అత్యుత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్ది ఆస్కార్ వేదికగా అవార్డులు సాధించాలి. ఈ దిశగా దర్శక, నిర్మాతలు ఆలోచించాలి. ప్రస్తుతం పూర్తిస్థాయి నిడివి కలిగిన చిత్రాన్ని నిర్మించే పనిలో ఉన్నాను. నిర్మాతలు ముందుకు వస్తే అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తానని ఆయన తెలిపారు.

## సన్ రైజ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ



కాకినాడ : ప్రతి పేదవానికి వైద్యం అందాలన్న లక్ష్యంతో సన్ రైజ్ ఆసుపత్రి ముందుకు సాగుతోందని ఆ ఆసుపత్రి సీ.ఈ.వో. ఎస్.ఎస్.సి.డా.చక్రరావు పేర్కొన్నారు. కాకినాడ భానుగుడి సెంటర్‌లో ఉన్న సన్ రైజ్ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు పది విభాగాలలో పేద ప్రజలకు, ఉద్యోగస్తులకు, జర్నలిస్టులకు,పెన్షర్ల కు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. జనరల్ సర్జరీ, గైనకాలజీ, న్యూరో సర్జరీ,యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజి, క్రిటికల్ కేర్, పాలి ట్రామా,విభాగాలలో ఎన్టీఆర్ వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్ కార్డు, జర్నలిస్ట్ హెల్త్ కార్డు, ఇతర ఆరోగ్య భీమాతో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. నగదు రహిత వైద్య సేవలు ఈ ఆస్పత్రిలో పూర్తిగా అందుబాటులో ఉంటాయన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవా విభాగం ప్రారంభోత్సవంలో చక్ర రావు తదితర వైద్యులు జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ కార్యక్రమంలో డా.భూపతి రాజు, రవి వర్మ,ఎమ్ఐ జంపన సుబ్బారావు, డా.కంచర్లపల్లి పార్థసారథి, డా.కే.రాజ్ కుమార్ ,డా.కిరణ్, డా.జవహర్,డా.బోండా సూర్యారావు, డా.కాకర్ల భరత్ కుమార్, డా.లక్ష్మోజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోలుగుంట డివిజన్ మారిస్తే ఎంతో నష్టం

### కొవ్వూరు ఎంపిటిసి కాంతమ్మ

రోలుగుంట : రోలుగుంట మండలాన్ని నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని, కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన చోడవరం డివిజన్‌లో చేర్చొద్దని కొవ్వూరు ఎంపిటిసి సభ్యులు కాంతమ్మ అభిప్రాయం వ్యక్తం చేశారు. చోడవరం, చింతపల్లి కొత్త రెవెన్యూ డివిజన్లపై ప్రభుత్వ ఆలోచన అంటూ వార్తలు రావడం పై ఆమె స్పందించారు. 21 పంచాయతీలు గల రోలుగుంట మండలంలో 50వేల జనాభా ఉన్నారన్నారు. ఫిర్యాదులుగా ఉన్నప్పటి నుంచి రోలుగుంట చేరువలో ఉన్న నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగుతుంది. చోడవరం నియోజకవర్గం ఏర్పాటు కావడంతో పిఆర్ ఇంజనీరింగ్ పనులు పాడేరు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు చోడవరం మార్పు చేశారు.

అప్పటి నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గతంలో కొత్త రెవెన్యూ డివిజన్ ప్రతిపాదనలు వచ్చినప్పుడు, ప్రజాసంతకాల సేకరణతో తమ అభ్యంతరాలు ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. మళ్లీ ప్రభుత్వం అటువంటి ఆలోచన చేస్తే ప్రజలకు నష్టమే అధికంగా ఉంటుందన్నారు.

## భద్రాద్రిలో బెల్లం ప్రసాదాలు సిద్ధం

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఇప్పటికే ఉన్న ప్రసాదాలకు తోడు కొత్తగా బెల్లంతో తయారైన ప్రసాదాలను సిద్ధం చేశారు. వీటిని విక్రయం చనున్నట్లు ఈవో తాళ్లూరి రమేశ్‌బాబు తెలిపారు. రాష్ట్రం లోని అన్ని పెద్ద ఆలయాల్లో బెల్లం ప్రసాదాల తయారీకి ఉన్నతాధికారులు మౌఖిక ఆదే శాలు ఇవ్వడంతో ఈ తరహా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. 100 గ్రాముల బెల్లం లడ్డూ ధర రూ.20 నిర్ణయించారు. 100 గ్రాముల బెల్లం పొంగలి రూ.10, 100 గ్రాముల బెల్లం రవ్వ కేసరి రూ.10 నేటి నుంచి కౌంటర్లలో భక్తులకు అందించనున్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అవార్డు

### హాజరైన ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ బృందం



కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని ,విద్యార్థులు ను అభినందించు నిమిత్తం సంచాలకులు పు ర పరిపాలన శాఖ శ్రీ కే.కన్నబాబు ఐ.ఏ.ఎస్. వారు కాకినాడ నగరమునకు విచ్చేసి స్థానిక సాలిపేట బాలికల ఉన్నత పాఠశాల నందు సదరు విద్యార్థిని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. మరియు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మెమెంటో లు అందించారు. ఈ ఫలితాలను ఆదర్శంగా తీసుకొని రాబోయే సంవత్సరాల్లో ఉత్తీర్ణత శాతం మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు , విద్యార్థిని, విద్యార్థులు కృషి చేయాలని తెలిపినారు. తదుపరి కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయ వెనుక భాగమున ఉన్న దంటు కళా క్షేత్రం నందు ఉబయ గోదావరి జిల్లాల నగర పాలక సంస్థలు మరియు పురపాలక సంఘముల కమీషనర్లు , సిబ్బందితో , సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజారోగ్య విభాగం అత్యంత ప్రధాన మైనదనిపురపాలక సంఘాలలో పారిశుద్ధ్యం విషయంలో అత్యంత శ్రద్ధ వహించాలని, ప్రణాళికాబద్ధంగా సూక్ష్మ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని, సదరు సూక్ష్మ పారిశుధ్య కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుడు నిర్ణీత సమయంలో నిర్ణీత ప్రదేశములను శుభ్రపరచుట చేయవలసియుండును అని, తద్వారా నగర పారిశు ధ్ధ్యము మెరుగుపరచుకోవచ్చు నని, సాంకేతిక పరమైన వాహనములు సమకూర్చుకుని మరింత సమర్థవంతంగా పారిశుధ్య మును నిర్వహించవచ్చని ప్రతి ఒక్క ఉద్యోగి పారిశుద్ధ్య విభాగానికి సంబంధించి అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, అందు నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా మైక్రో పాకెట్స్ విధానం ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఎట్లు నిర్వహించ వలెను తెలిపియున్నారు. తదుపరి పురపాలక మరియు నగరపాలక సంస్థ ల యందు ప్రజలనుండి దాఖలు కాబడిన ఫిర్యాదులకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు, మరియు సదరు ఫిర్యాదులను ఎట్లు పరిష్కరించ వలెను తెలిపియున్నారు. సమీక్ష సమావేశం తదనంతరం కాకినాడ నగర పాలక సంస్థ పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులు పదవతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించినశీదులకు గాను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె. రమేష్ ప్రత్యేకంగా అభినందిస్తూ, దుశ్శాలువతోటి సత్కరించారు. ఈ కార్యక్రమానికి సంచాలకులు పుర పరిపాలనా శాఖ కె.కన్నబాబు ఐ.ఏ.ఎస్. వారు అదనపు సంచాలకులు పుర పరిపాలన శాఖ పి. ఆశాజ్యోతి గారు సంయుక్త సంచాలకులు పుర పరిపాలనా శాఖ పి.పూర్ణ చంద్ర రావు గారు ప్రాంతీయ సంచాలకులు పరిపాలనా శాఖ రాజమహేంద్రవరం రీజియన్ జి. నాగరాజు గారు కమిషనర్ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ సుమిత్ కుమార్ ఐ.ఏ.ఎస్. సూపరింటెండెంట్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ రాజమహేంద్రవరం సుధాకర్ మరియు కమీషనర్ కాకినాడ నగర పాలక సంస్థ కె. రమేష్ అదనపు కమిషనర్ కాకినాడ నగర పాలక సంస్థ శ్రీ సి.హెచ్. నాగ నరసింహారావు గారు ఉభయగోదావరి జిల్లాల కమిషనర్లు మరియు సిబ్బంది హాజరైనారు.



## దర్శక దిగ్గజానికి ఇంతటి అవమానమా?



విశాఖ సిటీ: ఇటీవల ఆర్కే బీచ్ రోడ్డులో దర్శక దిగ్గజం దాసరి నారాయణరావు విగ్రహం తొలగించి దర్శకులకు తీరని అవమాన%శీ% చేసారని విశాఖ దర్శకుల సంఘము నేతలు యాద్ కుమార్, వినయ్ కుమార్, సిహెచ్. అనీల్ కుమార్ తదిరారులు పేర్కొన్నారు. బుధవారం బీచ్ రోడ్డులో నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కోర్ట్ తీర్పును గౌరవిస్తామన్నారు.

అయితే ఈ విగ్రహాల తొలగింపు లో రాజకీయ కుట్ర దగివుందని అనుమానం వ్యక్తపరిచారు. దాసరి విగ్రహాన్ని పెట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిహెచ్. అనీల్ కుమార్ కోరారు. విగ్రహం నెలకొల్పే అర్హత దాసరికి ఉందన్నారు.

సినీలోకం ఈ ఉదంతం పై స్పందించాలని వారు కోరారు. ఈ నిరసన లో బాదంగీర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక పరీక్షల దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ అర్హత పరీక్ష, బీఈడీ(స్పెషల్ బీఈడీ) కోర్సుల ప్రవేశ పరీక్ష గడువును ఈనెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు ఖమ్మం ప్రాంతీయ అధ్యయన కేంద్రం సహాయసంచాలకురాలు డాక్టర్.ఏ.రమాదేవి వ తెలిపారు. 2019-20 విద్యాసంవత్సరానికి బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ తేదీని ఈనెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 18సంవత్సరాల వయస్సు నిండిన వారు ఎవరైనా ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. బీఈడీ కోర్సుల్లో ప్రవేశ పరీక్షకు టీటీసీ/టీపీటీ/ హెచ్‌పీటీ/బెట్/యూపీటీ కోర్సుల్లో ఏదైనా శిక్షణ పొందిన వారు మాత్రమే బీఈడీ కోర్సుల ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు.

# దేశ ఆర్థిక వ్యవస్థకు దెబ్బే

## -అమెరికా ఆంక్షల నేపథ్యంలో కేర్ రేటింగ్స్ అంచనా
## -ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లు ఆగితే కష్టమే
## -క్యాడ్ పెరుగుదల, రూపాయి పతనం, ద్రవ్యోల్బణానికి అవకాశాలు




ముంబై: ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లపై అమెరికా విధించిన ఆంక్షలు.. భారత్ వంటి చమురు దిగుమతి ఆధారిత దేశాల ఆర్థిక వ్యవస్థల్ని పెద్ద ఎత్తున కుదిపేయనున్నాయి. కరెంట్ ఖాతా లోటు (క్యాడ్), డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం, ద్రవ్యోల్బణం వంటి వాటికి దారి తీయవచ్చని మంగళవారం కేర్ రేటింగ్స్ అభిప్రాయపడింది. భారత్‌సహా ఎనిమిది దేశాలకు ఇరాన్ నుంచి ముడి చమురు దిగుమతులపై ఇచ్చిన మినహాయింపుల్ని అమెరికా పొడిగించబోమని స్పష్టం చేసింది. ఇక ఇరాన్ నుంచి ఏ దేశం కూడా ముడి చమురును కొనుగోలు చేయవద్దని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. చారిత్రాత్మక 2015 ఇరాన్ న్యూక్లియర్ డీల్ నుంచి ట్రంప్ వైదొలిగిన నేపథ్యంలో గతేడాది నవంబర్ నుంచి ఆ దేశంపై అమెరికా ఆంక్షలు మొదలైయ్యాయి.

అయితే అమెరికాపై ఒత్తిడితో భారత్, చైనా, టర్కీ, జపాన్, గ్రీస్, ఇటలీ, దక్షిణ కొరియా, తైవాన్ దేశాలకు ఆరు నెలలపాటు మినహాయింపు లభించింది. ఈ గడువు వచ్చే నెల మే 2తో ముగిసిపోతుండగా, ఆ తర్వాతి నుంచి ఎవరూ ఇరాన్ ముడి చమురును కొనవద్దని ట్రంప్ తాజాగా స్పష్టం చేశారు. ఇరాన్ నుంచి అత్యధికంగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న టాప్-3 దేశాలు చైనా, జపాన్, భారత్‌లే. తమ నిర్ణయాన్ని బేఖాతరు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని అన్ని దేశాలకు ట్రంప్ హెచ్చరించిన సంగతీ విదితమే.

**ప్రత్యామ్నాయం అన్వేషించాలి**

మెజారిటీ ఇంధన అవసరాలు దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో సహజంగానే దేశ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ నిర్ణయాల ప్రభావం ఉంటుంది. ఈ క్రమంలో స్వదేశీ ఇంధన వనరుల వినియోగంపై ద ృష్టి పెట్టాలని, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిజానికి భారత్, చైనా తదితర ఎనిమిది దేశాలు మినహా ప్రపంచంలోని మిగతా దేశాలేవీ కూడా ఇరాన్ నుంచి ముడి చమురును ఇప్పుడు దిగుమతి చేసుకోవడం లేదు. ఈ ఎనిమిది దేశాల్లోనూ జపాన్, గ్రీస్, ఇటలీ, తైవాన్, దక్షిణ కొరియా దేశాలు తమ దిగుమతుల్ని తగ్గించుకున్నాయి. ఫలితంగా వచ్చే నెల 2 తర్వాత ఈ దేశాలపై అమెరికా ఆంక్షల ప్రభావం అంతగా ఉండ దు. కానీ భారత్‌పై ఎక్కువగా ఉండనున్నది. దీనికి కార ణం ఇంకా ఇరాన్ ముడి చమురు దిగుమతులు బాగానే కొనసాగుతుండటం. దీంతో ఇరాన్ క్రూడ్ పై ఆధారపడటం తగ్గించుకుని, ఇతర దేశాల నుంచి పెంచుకోవాలని, దేశీయంగా ఉత్పత్తినీ వ ృద్ధి చేసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. కాగా, 2017 ఏప్రిల్-2018 జనవరి వరకు భారత్‌కు ఇరాన్ 18.4 మిలియన్ టన్నుల ముడి చమురును సరఫరా చేసింది.

**మోదీ వైఫల్యం: కాంగ్రెస్**

అమెరికా నిర్ణయం.. మోదీ వైఫల్యం వల్లేనని కాంగ్రెస్ విమర్శించింది. ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లు భారత్‌కు ఎంత అవసరమో వివరించడంలో కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని, ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరమైన అపజయాన్నే మూటగట్టుకున్నారని సీనియర్ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం దేశంలో ఇంధన ధరల్ని తారాస్థాయికి తీసుకెళ్తుందని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరిగి సామాన్యుల జీవితాలు అస్తవ్యస్థమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లపై భారత్‌కున్న మినహాయింపును పొడిగించకపోతే దేశ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతుందని భారత వాణిజ్య ప్రోత్సాహక మండలి (టీపీసీఐ) మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. చమురు ధరలు 10 శాతం పెరిగితే 7 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటుకు దారి తీస్తుందని, జీడీపీ కూడా 0.2 శాతం క్షీణిస్తుందని టీపీసీఐ చైర్మన్ మోహిత్ సింగ్లా అన్నారు. మరోవైపు అమెరికా నిర్ణయం మధ్యప్రాచ్య సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుందని చైనా అభిప్రాయపడింది.

**ధరలపై ప్రభావం?**

దేశీయ ఇంధన అవసరాలు 80 శాతానికిపైగా విదేశీ దిగుమతుల ద్వారానే తీరుతున్న విషయం తెలిసిందే. ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంటున్న క్రూడ్.. మొత్తం భారత్ ముడి చమురు దిగుమతుల్లో పదో వంతుగా ఉన్నది. సౌదీ అరేబియా, ఇరాక్‌ల తర్వాత ఇరాన్ నుంచే భారత్‌కు భారీగా ముడి చమురు వస్తున్నది. దీంతో అమెరికా తాజా ఆంక్షలు దేశంలో ఇంధన ధరలపై ప్రభావం చూపవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 74 డాలర్లను దాటేసింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 2 తర్వాత ఇరాన్‌పై ఆంక్షలు అమల్లోకి రానుండటంతో మరింత పెరుగవచ్చని విశ్లేషిస్తున్నారు. పెరిగే ఇంధన ధరలు దేశ ఆదాయ, వ్యయాలను భారీగా ప్రభావితం చేస్తాయంటున్నారు. పెట్రో ఉత్పత్తులపై అధిక పన్నుల కారణంగా ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని, అలాగే రవాణా ఖర్చులు పెరిగి వ్యయం కూడా మితిమీరుతుందని హెచ్చరిస్తున్నారు. పాత పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నిర్ణయాల ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న భారత జీడీపీని అమెరికా ఆంక్షలు మళ్లీ దిగజార్చవచ్చన్న ఆందోళనను వెలిబుచ్చుతున్నారు.

**ఆర్బీఐ కోతలకు బ్రేక్..**

గ్లోబల్ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు 10 శాతం పెరిగినా.. క్యాడ్ 0.40 శాతం ఎగబాకుతుందని, 3-4 శాతం రూపాయి విలువ పడిపోతుందని, ద్రవ్యోల్బణం కూడా 0.24 శాతం మేర ఎగిసిపడుతుందని కేర్ రేటింగ్స్ హెచ్చరించింది. బ్యారెల్ ముడి చమురు ధర దాదాపు 75 డాలర్ల వద్దే నెల రోజులపాటు కదలాడితే.. ఆర్బీఐ వడ్డీరేట్ల కోతలు కూడా ఆగిపోవడం ఖాయమని చెప్పింది.

రెపో, రివర్స్ రెపోలను ఆర్బీఐ గత ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో వరుసగా తగ్గించిన విషయం తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపులో ఉన్న నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను ముఖ్యంగా పారిశ్రామికోత్పత్తిని పరుగులు పెట్టించేందుకు రాబోయే సమీక్షల్లోనూ కీలక వడ్డీరేట్లకు కోతలు పెడుతుందన్న అంచనాలున్నాయి.

అయితే ట్రంప్ తాజా నిర్ణయం ఈ అంచనాలపై నీళ్లు చల్లుతున్నది. జూన్ ద్రవ్యసమీక్షలో రెపో, రివర్స్ రెపోల జోలికి ఆర్బీఐ పోకపోవచ్చన్న అభిప్రాయాలే వ్యక్తమవుతున్నాయి.

# చైతూ కోసం ఎదురుచూపులు



ప్రేమికుల మధ్య, భార్యాభర్తల బంధంలో ఎడబాటు భరించరానిదిగా ఉంటుంది. ప్రియసహచరులకు కొన్ని రోజులు దూరంగా ఉన్నా సరే రోజులు యుగాలుగా గడిచినట్లు అనిపిస్తుంది. అక్కినేని కోడలు సమంత కూడా ప్రస్తుతం అదే మనోస్థితిలో ఉంది. భర్త నాగచైతన్యను ఎంతగానో మిస్సవుతున్నానని ఈ అమ్మడు ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఓ పోస్ట్ అందరిని ఆకట్టుకుంటున్నది. ప్రస్తుతం సమంత పోర్చుగల్‌లో ఉంది. నాగార్జున నటిస్తున్న మన్మథుడు-2 చిత్రీకరణ కోసం ఆమె ఇటీవలే పోర్చుగల్‌కు వెళ్లింది. ఈ సినిమాలో సమంత అతిథి పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. చైతూ మాత్రం హైదరాబాద్‌లోనే ఉన్నారు. దీంతో తన భర్తకోసం ఆత ృతగా ఎదురుచూస్తున్నానంటూ సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. అందులో నా చైతూ కోసం ఎదురుచూస్తున్నాను అంటూ వ్యాఖ్యానించింది. దీనికి దిగాలుగా చూస్తున్న ఓ స్కెచ్ ఫొటోను జతచేసింది. ఇటీవల విడుదలైన మజిలీ చిత్రంతో నాగచైతన్య, సమంత మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తెలుగులో సమంత 96 రీమేక్‌లో శర్వానంద్ సరసన నటిస్తున్నది. ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు.

# నా మనసుకు నచ్చాలి



నేటితరం కథానాయికలంతా కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే మరోవైపు ప్రయోగాత్మక ఇతివ ృత్తాలు, ఛాలెంజింగ్ రోల్స్‌తో ప్రతిభను చాటుకుంటున్నారు. సినిమాల పరంగా తనకు అలాంటి పట్టింపులేవి లేవని చెబుతున్నది అంజలి. ప్రయోగాలు చేయడం కంటే వచ్చిన అవకాశాలతో సంత ృప్తి చెందుతానని చెబుతున్నది. ప్రస్తుతం తెలుగు చిత్రసీమకు దూరంగా ఉంటున్న ఆమె తమిళంలో బిజీగా ఉంది. తన సినీ ప్రయాణాన్ని గురించి ఆమె మాట్లాడుతూ కథాంశాలు, పాత్రల పరంగా నాకు ఎలాంటి కోరికలు లేవు. కల నెరవేరకపోతే నిరూత్సాహం ఆవహిస్తుంది. ప్రణాళికలు వేసుకుంటూ నటించడం నచ్చదు. అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ నా పాత్రకు న్యాయం చేయడానికే ప్రాధాన్యతనిస్తాను. సమయానికి అనుగుణంగా నా మనసుకు నచ్చిన సినిమాలు చేస్తున్నాను. కథలో నా పాత్రకే ప్రాధాన్యత ఉండాలి... నేనే అందరికంటే ఎక్కువగా తెరపై కనిపించాలని ఆలోచించను. పాత్ర నిడివి తక్కువైనా ప్రాధాన్యత ఉంటే చాలు. అంతకుమించి ఏమీ కోరుకోను అని తెలిపింది. ప్రస్తుతం తమిళంలో లీసా, సింధుబాద్, నాడోడిగల్-2తో పాటు మరో నాలుగు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నది అంజలి.

# చిత్రభాను

## ముంబయిలో సాహో



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం సాహో. సుజిత్ దర్శకుడు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిస్తున్నారు. శ్రద్ధాకపూర్ కథానాయిక. ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ముంబయిలో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ షెడ్యూల్‌తో ప్యాచ్‌వర్క్ మినహా షూటింగ్ మొత్తం పూర్తికానుంది. ముంబయి షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు చిత్ర ప్రధాన తారాగణమంతా పాల్గొంటుండగా కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ట్కస్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. బాలీవుడ్, హాలీవుడ్‌కు చెందిన సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. ఈ సినిమాలో యాక్షన్ ఘట్టాలు రొమాంచితంగా సాగుతాయని, విజువల్‌వండర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ పాత్ర చిత్రణ సరికొత్త పంథాలో ఉంటుందని చెబుతున్నారు. ఈ సినిమాలోని ప్రభాస్ ఫస్ట్‌లుక్‌కు అభిమానుల నుంచి విశేషమైన స్పందన లభించింది. నీల్ నితిన్ ముఖేష్, అరుణ్‌విజయ్, జాకీష్రాఫ్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్ని పోషిస్తున్నారు.

## కార్తికేయ సీక్వెల్?



నిఖిల్, స్వాతి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన కార్తికేయ(2014) చిత్రం చక్కటి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. సుబ్రహ్మణ్యస్వామి దేవాలయానికి సంబంధించిన రహస్యం నేపథ్యంలో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం ప్రేక్షకుల్ని మెప్పించింది. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌ను రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో నిఖిల్, స్వాతి తిరిగి జోడీ కట్టబోతున్నారు. చందు మొండేటి దర్శకత్వ బాధ్యతలు వహిస్తారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఓ గ్రామం నేపథ్యంలో కార్తికేయ కథ నడుస్తుంది. కాగా సీక్వెల్‌ను కుంభమేళా బ్యాక్‌గ్రౌండ్‌లో భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి లొకేషన్లలో చిత్రీకరణ జరుపబోతున్నారని తెలుస్తున్నది.

## వేశ్యా పాత్రలో శ్రద్ధాదాస్!

శ్రద్ధాదాస్ వేశ్య పాత్రలో నటించిన లఘు చిత్రం ప్యూర్ సోల్. చిలుకూరి ఆకాష్‌రెడ్డి దర్శకత్వంలో నోబుల్‌రెడ్డి కోట్ల ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఓ సామాజిక సందేశాన్ని జోడించి తెరకెక్కించిన ఈ లఘు చిత్రాన్ని శనివారం రాత్రి హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. దర్శకుడు మాట్లాడుతూ ఓ వేశ్య, ఓ చిత్రకారుడు పాత్రల్ని తీసుకుని ఆద్యంతం ఆసక్తికరంగా ఈ లఘు చిత్రాన్ని ఇప్పటి వరకు వచ్చిన వాటికి పూర్తి భిన్నంగా మంచి క్వాలిటీతో రూపొందించాం. ప్రేమలో విఫలమైన వర్ణ అనే చిత్రకారుడు ప్యారిస్ ఎగ్జిబిషన్‌లో 100వ పెయింటింగ్ కోసం శ్వేత అనే ఓ వేశ్యని ఎంచుకుంటాడు. ఆ తరువాత ఏం జరిగింది?. వర్ణ తన వందవ పెయింటింగ్‌ని పూర్తి చేశాడా? లేదా అన్నదే ఇందులో ఆసక్తికరం అన్నారు.

## మారుతి దర్శకత్వంలో..!

చిత్రలహరి విజయంతో ఉత్సాహంతో వున్న సాయితేజ్ తాజగా కొత్త చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రభాస్‌తో సాహో చిత్రాన్ని నిర్మిస్తున్న యువీ క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. తొలుత ఈ సినిమాను గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించాలనుకున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్‌ని నిర్మించడానికి యువీ క్రియేషన్స్ సంస్థ ఆసక్తిని చూపించడంతో ఈ సంస్థతో కలిసి గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం స్క్రిప్ట్‌కు తుదిమెరుగులు దిద్దుతున్న మారుతి ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలిసింది.






# శ్రీచరణులను దర్శించుకున్న రాజకీయ ప్రముఖులు





-జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారిని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ కలుసుకుని ఆశీస్సులు గైకొన్నారు. ముందుగా పీఠప్రాంగణంలో గల శ్రీ మేధాదక్షిణామూర్తిని, శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారిని, శ్రీ దాసాంజనేయస్వామివారిని మరియు శ్రీ వల్లీదేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిరిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజ్యస్వామివారితో సుమారు గంటన్నర సేపు ఏకాంతగా చర్చలు జరిపారు. అనంతరం భారతీయ జనతా పార్టీ ఎం.ఎల్.సి సోమువీర్రాజు కూడా పూజ్యస్వామివారిని దర్శించి ఆశీస్సులు గైకొన్నారు. ముందుగా పీఠప్రాంగణంలో గల సకలదేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం కొద్దిసేపు ఏకాంతంగా చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలస్వామి కూడా పాల్గొన్నారు.

# గీతంలో కాటన్ 216వ జయంతి



సాగర్‌నగర్‌: ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 216వ జయంతి సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ భవనంలో జయంతి సభను నిర్వహించారు. ఇన్ చార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, హైదరాబాద్ గీతం ప్రాంగణం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్, బెంగళూరు గీతం ప్రాంగణం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.వి.శివపుల్లయ్య రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె.వి.రమేష్, సీనియర్ ప్రొఫెసర్‌లు ఎమ్.రమేష్, ప్రొఫెసర్ ఎస్.ప్రభాకర్ తదితరులు పాల్గొని కాటన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్ చార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రజల బాగు కోసం తపన పడి ఆంధ్ర రాష్ట్రాన్ని పచ్చగా ఉంచడానికి కాటన్ నిర్మించిన ఆనకట్టలు దోహదపడ్డాయని అన్నారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే యువత కాటన్ వంటి నిస్వార్థ నిపుణులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

# ప్రపంచకప్‌కు ధోనీ సేవలు అవసరం

## - దినేశ్ కార్తిక్ అనుభవం కీలకం - టీమిండియా సారథి విరాట్ కోహ్లీ

ముంబయి: టీమిండియా మాజీ సారథి ఎంఎస్ ధోనీని విమర్శించే వారిపై టీమిండియా సారథి విరాట్ కోహ్లీ మండిపడ్డాడు. వికెట్ కీపర్‌గా టీమిండియాకు ధోనీ అందించిన సేవలు వెలకట్టలేనివన్నాడు. అతడి అనుభవం ప్రపంచకప్‌లో టీమిండియాకు కీలకం కానుందని చెప్పాడు. విరాట్ కోహ్లీ మొదటి సారిగా ప్రపంచకప్‌లో భారత జట్టుకు సారథ్యం వహించనున్నాడు. ధోనీ జట్టులో ఉండటం వల్ల తాను స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నాడు. దీనిపై కోహ్లీ మాట్లాడుతూ..

నా క్రికెట్ కెరీర్ మొదలైంది ధోనీ సారథ్యంలోనే. కొన్ని సంవత్సరాలుగా అతడిని దగ్గర నుంచి చూస్తున్నాను. ధోనీ జట్టులో ఉండటం ఎంతో ముఖ్యం.అతడు గేమ్ ఛేంజర్. ఎన్నో కీలక సమయాల్లో స్టంప్స్ వెనక వికెట్లను తీశాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్‌లోనూ అతడేంటో చూశాం. జట్టులో ప్రతి ఒక్కరూ బాగా రాణించాలంటే ధోనీ సలహాలు, సూచనలు ఎంతో అవసరం అని తెలిపాడు.



ఇక ప్రపంచ కప్‌లో రిషభ్ పంత్‌కు బదులు దినేశ్ కార్తిక్‌ను ఎంచుకోవడం పైనా విరాట్ మాట్లాడాడు. మ్యాచ్‌లో జట్టు ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పుడు దినేశ్ కార్తిక్ అనుభవం ఎంతో ఉపయోగపడుతుంది. దినేశ్ ఎన్నోసార్లు మ్యాచ్‌ను గట్టెక్కించాడు. ఫినిషర్‌గానూ దినేశ్ అద్భుతం. ఆటగాళ్లలో 15 మందిని జట్టుకు ఎంపిక చేయడం అంత సులభం కాదు. అందుకే నేను ఆటగాళ్లకు చెబుతున్నాను. అందరూ సిద్ధంగా ఉండండి. ఎప్పుడైనా ఏదైనా అవకాశం వస్తే మిమ్మల్ని ఎంపిక చేసుకోవచ్చు అని పేర్కొన్నాడు.

# కమనీయం - కడు రమణీయం సత్యదేవుని కల్యాణం

## - అధిక సంఖ్యలో కల్యాణం వీక్షించడానికి వచ్చిన భక్తులు - ప్రత్యేక ఏర్పాట్లు చేసిన దేవస్థానం అధికారులు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరంలో భక్తుల పాలిట కొంగుబంగారంగా రత్నగిరిపై కొలువై యున్న శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి వార్షిక దివ్య కళ్యాణం వైశాఖ శుద్ధ ఏకాదశి బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్మార్త,ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించిన ఈ కళ్యాణ కార్యక్రమాన్ని కనులారా వీక్షించడానికి అశేష భక్తజనం తరలి రావడంతో రత్నగిరి అమరధామంగా మారింది. ఈ వేడుకలో భాగంగా ఉదయం 8 గంటలకు ప్రధాన ఆలయంవద్ద షోడశోపచార పూజలతో దేవతలకు ఆవాహన చేయడం ద్వారా అంకురార్పణ చేసి ధ్వజారోహణ గావించారు. రాత్రి 7 గంటలకు జగత్కళ్యాణ కారుకులైన శ్రీ సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను వెండి గరుడ వాహనంపై పెండ్లి పెద్దలైన క్షేత్రపాలకులు సీతారాములను వెండి పల్లకీలోను గ్రామంలో ఊరేగించి కళ్యాణవేదిక వద్దకు తోడ్కొని వచ్చారు.ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా హాజరైన జిల్లా కలెక్టర్ కార్తీకేయమిశ్ర, జాయింట్ కలెక్టర్ మల్లిఖార్జునరావు,ఆర్ డీ వో వసంతరాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.వి.సురేష్ బాబు,చైర్మన్ ఐ.వి.రోహిత్ తదితరులు కళ్యాణ సామగ్రిని వేదిక వద్దకు తీసుకువచ్చారు. రాత్రి 9.30 గంటలకు సుగంధ భరిత పుష్పాలు,రంగురంగుల విద్యుత్ దీపకాంతులతో అత్యంత మనోహరంగా అలంకరించిన కళ్యాణ వేదికపై స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవానికి అర్చక స్వాములు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి.సత్యనారాయణ ఆధ్వర్యం లో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం గావించి పాణిగ్రహణ సంకల్పం, కన్యావరణం,గౌరీపూజ,గోత్ర ప్రవరలు, ద్వితీయ యజ్ఞోపవీతధారణ,మహా సంకల్పం,కన్యాదానం, మధుపర్కప్రాశన కార్యక్రమాలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు,వేద పండితుల మంత్రోచ్ఛారణలతో రత్నగిరి మార్మోగుతుండగా బాణాసంచా వెలుగుజిలుగుల నడుమ అర్చకులు స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ఒకరికొకరు జీలకర్ర, బెల్లం ఉంచినట్లుగా చేసి సుముహూర్తధారణ గావించారు. యుగచిధ్రాభిషేకం, మంగళసూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు, బ్రహ్మముడి,రక్షాబంధన కార్యక్రమాలు పూర్తి చేశారు. నూతన వధూవరుల పాణిగ్రహణంతో కళ్యాణతంతు వైభవంగా ముగిసింది. తదుపరి కళ్యాణ తలంబ్రాలు, ప్రసాదం ప్రత్యేక కౌంటర్ల ద్వారా సిబ్బంది భక్తులకు పంపిణీ చేశారు.

కళ్యాణాన్ని తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం అధికారులు తగిన చర్యలు చేపట్టగా ఎస్పీ విశాల్ గున్ని ఆదేశాల మేరకు డిఎస్పీ సిహెచ్ వెంకట రామారావు ఆధ్వర్యంలో సుమారు 350 మందికి పైగా స్పెషల్ పోలీసు బృందం మరియు అన్నవరం ఎస్సై మురళీమోహన్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.స్వామివారి కళ్యాణ ఏర్పాట్లును దేవస్థానం పిఆర్వో తులా.రాముడు పర్యవేక్షించారు.శ్రీ స్వామివారి కళ్యాణోత్సవ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది,అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఏపీలో మరోసారి రీపోలింగ్

అమరావతి: ఏపీలో మరోసారి రీపోలింగ్‌కు ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈనెల 19న సార్వత్రిక ఎన్నికల చివరి దశ పోలింగ్ రోజున 5 చోట్ల రీపోలింగ్ నిర్వహించాలని సీఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఎన్.ఆర్ కమ్మపల్లి-321, పులివర్తిపల్లి-104, కొత్తకండ్రిగ-316, కమ్మపల్లి-318, వెంకట్రామపురం-313 పోలింగ్ బూత్‌ల్లో రీపోలింగ్‌కు ఆదేశించింది. ఇప్పటికే ఈనెల 6న రాష్ట్రంలో ఐదు స్థానాల్లో రీపోలింగ్ నిర్వహించారు. అయితే చంద్రగిరి స్థానంలో రీపోలింగ్ నిర్వహించాలంటూ ఈసీకి టీడీపీ, వైసీపీ పరస్పర ఫిర్యాదులు చేశారు.




పదవీ విరమణకు ముందు తూర్పు నౌకాదళాన్ని సందర్శించిన అడ్మిరల్ సునీల్ లాన్‌బా



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు

## - జిల్లా కలెక్టర్ కె.భాస్కర్



విశాఖపట్నం : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అద్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గతేడాది మార్చి వరకు జరిగిన రోడ్డు ప్రమాధాలతో పోల్చుకుంటే ఈ ఏడాది 16.16 శాతం రోడ్డు ప్రమాధాలు, 25.38 శాతం మరణాలు, 29.87 శాతం గాయపడ్డ వారి సంఖ్య పెరగడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఇందుకు కారణాలు ఏమని అధికారులను నిలదీశారు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చిస్తూ, సంబంధిత శాఖల అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. డివైడర్స్, రోడ్ మార్కింగ్, సైన్ బోర్డులు, సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్లు, రైలింగ్ లేకపోవడం తదితర కారణాల వల్ల ఈ రోడ్డు ప్రమధాలు జరుగుతున్నాయని గుర్తిస్తే, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాటిని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని, విస్తృత స్థాయిలో కేసులు బుక్ చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుకున్నవారి ఫొటోలు, వివరాలను పత్రికల్లో తరచుగా ప్రచురితం అయ్యేలా చూస్తే రోడ్డు ప్రమాధాలను కొంత వరకు నివారించ వచ్చనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఒక వేళ ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుపడితే వారి వివరాలను సంబందిత శాఖల జిల్లా అధికారులకు తెలియజేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఇటు వంటి వారిని వెంటనే సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు అందరికీ సర్క్యులర్ మెమో జారీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించేలా వత్తిడి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థి దశ నుండే అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఇందుకై అన్ని పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ప్రచార సామాగ్రిని, ప్రచురణలను సమకూర్చు కోవాలని జిల్లా విద్యా శాఖధికారిని ఆదేశించారు.

స్మార్టు సిటీ పనులు, భూగర్భ విద్యుత్ కేబుళ్లు, వాటర్ పైప్ లు తదితర పనులకు పలు మార్లు రోడ్లను త్రవ్వకుండా పనులు అన్నీ ఒకేసారి జరిగే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. పోలీస్ అధికారులు గుర్తించిన ప్రాంతాల్లో మల్టీ లెవిల్ పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని జి.వి.ఎం.సి. అధికారులను ఆదేశించారు. కార్ షెడ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య రోజురోజుకి పెరిగిపోవడం వల్ల ఆ జంక్షన్ ను ఐ.టి. సెజ్ రోడ్డు జంక్షన్ కు వెంటనే మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్. హెచ్ .అథారిటీ అధికారులను ఆదేశించారు. ఉప రవాణా కమిషనర్ ఎస్.వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఏప్రిల్ మాసంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, వాటి నివారణకు తీసుకుంటున్న రహదారి భద్రత చర్యలను వివరించారు.

పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్హా, జి.వి.ఎం.సి. కమిషనర్ ఎం.హరినారాయణన్, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ తదితరులతో పాటు రవాణా, ఎక్సైజ్, రోడ్లు,భవనాలు, పంచాయితీరాజ్, జి.వి.ఎం.సి. ఆర్.టి.సి. శాఖలకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com